# ప్రజా తపన

prajathapana.com

News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 56 బుధవారం 12 ఏప్రిల్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




## మాజీ సైనికులకు సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం

**ప్రజాతపన , న్యూఢిల్లీ :**

కేంద్రీయ సైనిక్ బోర్డు (కెఎస్‌బి) 31వ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. కెఎస్‌బి అనేది మాజీ సైనికులకు సంక్షేమం మరియు పునరావాసం (ఈఎస్‌ఎం) కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల (యూటీలు) అపెక్స్ బాడీ.మాజీ సైనికుల సంక్షేమం మరియు పునరావాసాన్ని మరింతగా నిర్ధారించడానికి విధానపరమైన చర్యల ద్వారా ఈఎస్‌ఎం సోదరులను చేరుకోవడానికి గల మార్గాలు సమావేశంలో చర్చించబడ్డాయి. కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ ముఖ్యోపన్యాసం చేస్తూ మాజీ సైనికులను జాతీయ ఆస్తులుగా అభివర్ణించారు. రాష్ట్రాలు/యుటిలు వారి గొప్ప మరియు ఆచరణాత్మక అనుభవాన్ని దేశ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడానికి కొత్త మార్గాలను రూపొందించాలని కోరారు. పలు రాష్ట్రాల్లో మాజీ సైనికులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉన్నాయని, వీటిని పూర్తిగా అనుసరించి పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

సైనికుల సంక్షేమం కోసం కేంద్రం మరియు రాష్ట్రాలు/యుటిలు ఎల్లప్పుడూ కలిసి పనిచేస్తున్నాయని రక్షణ మంత్రి ప్రశంసించారు. కెఎస్‌బి చేపడుతున్న పనులను సహకార సమాఖ్య విధానానికి ప్రకాశవంతమైన ఉదాహరణగా ఆయన అభివర్ణించారు. "రాష్ట్రాలు లేదా రాజకీయ పార్టీల మధ్య చాలా విషయాల్లో విభేదాలు ఉన్నాయి. ఇదంతా ప్రజాస్వామ్యంలో భాగమే. కానీ, మన సైనికులు %ఽ% అనుభవజ్ఞుల సంక్షేమం విషయానికి వస్తే అందరూ ఒకే వేదిక మీదకు వస్తారు. మన సైనికుల విషయంలో సామాజిక, రాజకీయ ఏకాభిప్రాయం ఎప్పుడూ ఉంటుంది. సాయుధ దళాలు మొత్తం దేశాన్ని సమానంగా రక్షించినట్లే మన సైనికులు పదవీ విరమణ చేసి తిరిగి

(మిగతా 2లో)

## మార్కెట్‌లోకి కాంపా కోలా

**ప్రజాతపన , న్యూఢిల్లీ :**




భారతదేశంలో శీతల పానీయాల మార్కెట్ నెమ్మదిగా వేడెక్కుతోంది. భారత మార్కెట్‌ను శాసిస్తున్న బహుళ జాతి కంపెనీలు కోకాకోలా, పెప్సీకి.. భారత్‌లో అత్యంత సంపన్నుడు ముఖేష్ అంబానీ కంపెనీ నుంచి గట్టి పోటీ ఎదురు కాబోతోంది. దశాబ్దాల నాటి కూల్‌డ్రింక్ బ్రాండ్ కాంపా కోలాను కొత్త అవతార్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటికే విడుదల చేసింది. ఇప్పుడు, సాఫ్ట్ డ్రింక్స్ మార్కెట్‌లో గరిష్ట వాటాను కైవసం చేసుకోవడానికి సన్నాహాలు చేస్తోంది.విజయవంతమైన రిలయన్స్ జియో ఫార్ములానే శీతల పానీయాల మార్కెట్‌లోనూ అనుసరిస్తోంది రిలయన్స్ ఇండస్ట్రీస్. ప్లాన్‌లో భాగంగా దూకుడైన ధరల విధానాన్ని అనుసరించింది. కోకా కోలా, పెప్సీ ఉత్పత్తుల ధరల్లో సగం కన్నా తక్కువ రేటుకే కంపా కోలాను అమ్ముతోంది. కూల్‌డ్రింక్స్‌కు అత్యంత కీలకమైన వేసవి సీజన్‌లో గట్టి పోటీ ఎదురు కావడంతో.. కోకా కోలా, పెప్సీ కంపెనీలు వాటి ఉత్పత్తుల రేట్లను తగ్గిస్తున్నాయి. అయితే.. రేట్లు తగ్గించినంత మాత్రాన వాటి కష్టాలు తగ్గే సూచనలు కనిపించడం లేదు.జాతీయ మీడియా కథనం ప్రకారం... రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ , చెన్నైకి చెందిన కాళీ ఎరేటెడ్ వాటర్ వర్క్స్‌తో చర్చలు జరుపుతోంది. రిలయన్స్ కాంపా కోలాను కాళీ ఎరేటెడ్ వాటర్ వర్క్స్ ప్లాంట్లలో తయారు చేసి, మార్కెట్ చేయడం గురించి ఈ చర్చలు జరుగుతున్నాయి. గత సంవత్సరం ఆగస్టులో కాంపా కోలాను కొనుగోలు చేయడానికి ముందే,

(మిగతా 2లో)



## జాతీయ స్థాయి ఆద్మీ పార్టీ గుర్తింపు పట్ల కేజ్రీవాల్ హర్షం

**ప్రజాతపన , న్యూఢిల్లీ :**

స్వల్ప కాలంలోనే జాతీయ స్థాయి గుర్తింపు పొందిన పార్టీగా ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భవించడం అద్భుతమని ఆ పార్టీ చీఫ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. దేశంలోని కోట్లాది మంది ప్రజల ఆశలు ఇప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ పట్ల విశ్వాసంగా మారాయన్నారు. ప్రజలు తమకు పెద్ద బాధ్యతను ఇచ్చారని తెలిపారు. దేవుని ఆశీర్వాదంతో ఈ బాధ్యతను

(మిగతా 2లో)

## ఏపీలో ఈ- పాఠశాల

**విజయవాడ:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న సంస్కరణలు పాఠశాల విద్యకు కొత్త ఊపిరులు అందిస్తోంది. ఇప్పటికే బైజూస్ ద్వారా స్మార్ట్ ఫోన్లలో, ట్యాబ్‌ల ద్వారా ఈ?కంటెంట్ అందిస్తున్న ప్రభుత్వం త్వరలో ఈ-పాఠశాలను ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఈ-కంటెంట్‌ను అందించనుంది. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ ప్రత్యేకంగా ఈ?పాఠశాల యాప్‌ను రూపొందిస్తోంది. ఈ కొత్త విధానం వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, కింది తరగతుల్లో స్మార్ట్ టీవీల ద్వారా ప్రభుత్వం డిజిటల్ విద్యాబోధన అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ తరగతులకు అవసరమైన



ఈ?కంటెంట్‌ను పూర్తి స్థాయిలో రూపొందించడానికి పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా 4వ తరగతి నుంచి ఈ?కంటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది. విద్యార్థుల సౌలభ్యం కోసం లాంగ్వేజెస్, నాన్ లాంగ్వేజెస్.. ఇలా అన్ని సబ్జెక్టుల్లోనూ ఈ?కంటెంట్‌ను రూపొందించే పనిలో ఎస్‌సీఈఆర్‌టీ నిమగ్నమైంది. ప్రస్తుతం 4వ తరగతి నుంచి నాన్ లాంగ్వేజెస్ సబ్జెక్టులకు బైజూస్ సంస్థ ద్వారా కంటెంట్ అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు దానికి ప్రత్యామ్నాయంగా ఎస్‌సీఈఆర్‌టీ అదే తరహాలో ఈ?కంటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది. నాన్ లాంగ్వేజెస్ సబ్జెక్టులకు మాత్రమే కాకుండా లాంగ్వేజెస్ సబ్జెక్టుల్లో కూడా రూపొందిస్తోంది. పాఠ్యప్రణాళికలను రూపొందించేది ఎస్‌సీఈఆర్‌టీయే కాబట్టి భవిష్యత్తులో బైజూస్ సంస్థ ఉన్నా, లేకున్నా విద్యార్థులకు ఇబ్బంది రాకుండా ప్రభుత్వం

(మిగతా 2లో)



## వేరు కాపురం పెడదామని ఒత్తిడి చేస్తే విడాకులు కోరవచ్చు

**బెంగాల్:**

తల్లిదండ్రులను వదిలేసి వేరుగా ఉందామంటూ భర్తను భార్య మానసికంగా వేధిస్తే.. బాధితుడు విడాకుల కోసం

(మిగతా 2లో)

## నేడు శ్రీశైలంలో కుంభోత్సవం

**శ్రీశైలం**

మంగళవారం శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థం శ్రీ భ్రమరాంబ దేవికి కుంభోత్సవం నిర్వహించారు. ప్రతి సంవత్సరం చైత్ర మాసం లో పౌర్ణమి తర్వాత వచ్చే మంగళవారం లేదా శుక్రవారాల్లో అమ్మవారికి కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవంలో భాగంగా అమ్మవారికి గుమ్మడి కాయలు నిమ్మకాయలు సాత్విక బలి గా సమర్పిస్తారు అలాగే కుంభహారతి మరియు



అమ్మవారికి పలురకాల వంటలతో మహానివేదన సమర్పిస్తారు . దేవాదాయ చట్టం ప్రకారం క్షేత్ర పరిధిలో జంతువులు పక్షులు బలులను పూర్తిగా నిషేధించారు ఆలయ సిబ్బంది స్థానిక రెవెన్యూ పోలీసు శాఖల సహకారంతో జంతు పక్షి బలి జరగకుండా పర్యవేక్షించాలని ఈవో లవన్న ఆదేశించారు. అమ్మవారి ఆలయంలోని అన్ని ఆర్జిత సేవలను, స్వామివారి కల్యాణోత్సవం ,

(మిగతా 2లో)

## ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీలకు అనుమతి

### స్టాలిన్ ప్రభుత్వం పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం కోర్టు

**ప్రజాతపన , న్యూఢిల్లీ :**



తమిళనాడులో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ర్యాలీలు నిర్వహించుకునేందుకు మార్గం సుగమమైంది. రాష్ట్రంలో ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీలపై మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఎంకే స్టాలిన్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ వి.రామసుబ్రమణియన్, పంజక్ మిథాల్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసింది .స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావడం, గాంధీ జయంతిని పురస్కరించుకుని ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతించాలని గత ఏడాది అక్టోబర్‌లో తమిళనాడు ప్రభుత్వాన్ని ఆర్‌ఎస్‌ఎస్

(మిగతా 2లో)

# అపర భగీరథుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య

## -నేడు ఆయన వర్ధంతి



ఇంకొద్ది క్షణాల్లో ఈ వంతెన కూలిపోతున్నది...రైలును ఆపండి అంటూ కేకలు వేసి ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన సునిశిత మేధావి మోక్షగుండం విశ్వేశ్వరయ్య. మేం మాటలతో కాలయాపన చేశాం..మీరు నిరంతర క్రియాశూరులై నవభారత నిర్మాణా నికి కృషి చేసిన మహనీయులంటూ 1961 సెప్టెంబర్ 15న బెంగుళూరులో జరిగిన విశ్వేశ్వరయ్య శతాబ్ది వేడుకల్లో అప్పటి ప్రధాని నెహ్రూ చేత ప్రశంసలు పొందిన అపర భగీరథుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య పూర్వీకు లు బేస్తవారపేట మండలం మోక్షగుండం గ్రామానికి చెందినవారే. శ్రీనివాసశాస్త్రి, వెంకటలక్ష్మమ్మలకు 1861 సెప్టెంబర్ 15న విశ్వేశ్వరయ్య జన్మించాడు. తల్లిదండ్రులు మోక్షగుండం గ్రామం నుంచి కర్నాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా చిక్‌బల్లాపూ ర్ సమీపంలోని ముద్దనహళ్లికి వెళ్లి స్థిరపడ్డారు. ప్రాథమిక విద్య చిక్‌బల్లాపూర్‌లో సాగింది. తన 15వ ఏటనే తండ్రిని కోల్పో యిన విశ్వేశ్వరయ్య మేనమామ రామయ్య ప్రోత్సాహంతో బెంగుళూరు సెంట్రల్ కాలేజిలో 1880లో ఎం.ఎలో ప్రథమస్థానంలో పాసయ్యాడు. గణితంలో ప్రతిభ కలిగిన విశ్వేశ్వరయ్యను మైసూరు రాజ్య దివాను రంగయ్య గుర్తించి ప్రభుత్వానికి సిఫారస్సు చేసి స్కాలర్‌షిప్ ఇప్పించారు. ఆ ఉపకార వేతనంతో ఆయన పూణే వెళ్లి ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. దీంతో బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం నేరుగా పబ్లిక్ వర్క్స్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా నియమించింది. మరుసటి ఏడాది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమితులయ్యారు. ఆంగ్లపాలకులు విశ్వేశ్వరయ్య కార్యదీక్షను గుర్తించి ప్రపంచ జలాశయాల్లో ఒక్కటైన సుక్కూర్ బరాజ్ నిర్మాణానికి ఇంజనీర్‌గా నియమించారు. దీంతో సింధూనది నీరు సుద్నోరుకు చేరేలా చేశాడు. ఆ నది నీరు వడగట్టడానికి ఒక వినూత్న విధానం రూపొందించారు. దాహరి దగ్గర నంబనది మీద సైఫన్ పద్ధతిన కట్ట నిర్మించారు. అక్కడ విశ్వేశ్వరయ్య మేధాశక్తితో ఆటో మేటిక్ గేట్లు నిర్మించి సమస్య తొలగించి అందరిని ఆశ్చర్యపరచారు. 1909లో మై సూర్ ప్రభుత్వం ఆయనను చీఫ్ ఇంజనీర్ గా నియమించింది. కృష్ణరాజసాగర్ డ్యాం డిజైన్ ఆయన ఆధ్వర్యంలోనే నిర్మాణం జరిగింది. దేశం లోనే తొలిసారిగా నీటి వృధాని అరికట్టేందుకు నూతన చర్యలను చేపట్టారు. వర్షపు నీటిని ప్రాజెక్టుల ద్వారా నిలుపుదల చేయడం, ప్రవ హించే నీటిని అనకట్టలు, ఉక్కు తలు పుల ద్వారా అరికట్టడానికి రూపకల్పన చేసి తన ఆధ్వర్యంలోనే నిర్మా ణాలు చేపట్టారు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ డ్రైనేజీ పద్ధతులకు రూప కల్పన చేసింది కూడా ఆయనే. ప్రముఖ ఇంజినీర్లు అయిన కె.ఎల్.రావు, జాఫర్ అలీలు కూడా ఆయన సహాయ సహకారాలు తీసుకున్న వారే. విశ్వేశ్వరయ్యకు 1948 లో మైసూర్ ప్రభుత్వం డాక్టరేట్ ఎల్.ఎల్. డి ఇచ్చి సత్కరించింది. అలాగే బాంబే, కలకత్తా, బెనారస్, అలహాబాద్ తదితర యూనివర్సిటీలు డాక్టరేట్ పురస్కారాలను అందజేశాయి. భారత ప్రభుత్వం 1955లో భారతరత్న అవార్డును ప్రధానం చేసి ఘనంగా సన్మానించింది. ఆయన ఇండి యన్ ఇరిగేషన్ కమిషన్ సభ్యులుగా, కర్నా టకలో చీఫ్ ఇంజనీరుగా అనేక బాధ్య తలను నిర్వహించి సివిల్ ఇంజనీరిం గ్‌లో అప్పట్లోనే నూతన వరవడులను సృష్టించి ప్రపంచ స్థాయిలో రికార్డులు సాధించారు. ఏప్రిల్ 12న 1962 లో విశ్వేశ్వరయ్య దివంగతులయ్యారు. అయితే ఆయన పుట్టినరోజు సెప్టెంబర్ 15వ తేదీన ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్నారు. ఆయన పూర్వీకులు పూజించే దేవాలయం మోక్షగుండం ముక్తేశ్వరాలయం నేటికి భక్తులతో ప్రత్యేక పూజ లు అందుకుంటుంది. మోక్షగుండం విశ్వేశ్వరయ్య పూర్వీకుల గ్రామం మోక్షగుండం గ్రామస్థులంటే కర్నాటక రాష్ట్రంలో చాలా గౌరంగా చూస్తారు. విశ్వేశ్వరయ్య 102 సంవత్సరాలు జీవించి ఇంజనీరింగ్ రంగా నికే పితామహుడయ్యారు.

## ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విద్యార్థులు

**ప్రజా తపన తిరుపతి :**

శ్రీశ్రీ కళావేదిక, చేజర్ల ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి ఆడిటోరియం నందు ఏప్రిల్ నెల 9,10 తారీకులలో 48 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలలో సాహితీరంగం నుంచి ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన తెలుగుశాఖ 4 వ సెమిస్టర్ విద్యార్థులు ఆలూరు చంద్రకళ, వరికుప్పల శివకుమార్, బుర్రె గణేష్ లు పాల్గొన్నారు. శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు %ం% ప్రోగ్రాం కన్వీనర్ గుతా హరిసర్వోత్తమ నాయుడు, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కె. రామావతి గారు ఆహ్వానం అందుకున్న విద్యార్థులు ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలలో పాల్గొని, సాహితీరంగంలో తమ ప్రతిభను ప్రదర్శించి, సాహిత్య చర్చలు, కవితా పఠనం లో పాల్గొన్నారు. అనంతరం చేజేర్ల ఇంద్రాణి



ట్రస్ట్ అధ్యక్షుడు, శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ గౌరవాధ్యక్షులు కింగ్ ఇంద్ర, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్, శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధికార ప్రతినిధి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీమతి కొల్లి రమావతి, తదితర కార్యక్రమ నిర్వాహకులు విద్యార్థులను ఘనంగా సన్మానించారు.

## మాజీ సైనికులకు సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

సమాజానికి తిరిగి వచ్చినప్పుడు వారు గౌరవ ప్రదమైన జీవితాన్ని గడపాలని నిర్ధారించుకోవడం మన జాతీయ మరియు సామూహిక బాధ్యత అని ఆయన అన్నారు.
సాయుధ దళాలను యవ్వనంగా ఉంచాలనే ఉద్దేశ్యంతో పెద్ద సంఖ్యలో సైనికులు 35-40 సంవత్సరాల వయస్సులో గౌరవప్రదంగా విడుదల చేయబడతారు. దీని ఫలితంగా ప్రస్తుతం ఉన్న 34 లక్షల మంది మాజీ సైనికులకు ప్రతి సంవత్సరం 60,000 మంది సైనికులు అదనంగా చేరుతున్నారు. ఈ క్రమంలో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఈఎస్ఎం సోదరుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న అచంచలమైన సంకల్పాన్ని వినిపించారు. వారి శ్రేయస్సు మరియు అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ తీసుకున్న అనేక చర్యలను వివరించారు. "గత మూడేళ్లలో కెఎస్‌బి ఆధ్వర్యంలో వివిధ సంక్షేమ పథకాల కింద సుమారు 3.16 లక్షల మంది లబ్ధిదారులకు సుమారు 800 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించబడింది. గత ఆర్థిక సంవత్సరంలో లక్ష మంది లబ్ధిదారులకు సుమారు రూ.240 కోట్లు పంపిణీ చేశారు. అవసరమైన మేరకు బడ్జెట్‌ను ప్రభుత్వం సమకూరుస్తోంది" అని చెప్పారు.

## వేరు కాపురం పెడదామని ఒత్తిడి చేస్తే విడాకులు కోరవచ్చు

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకోవచ్చని కలకత్తా హైకోర్టు స్పష్టం చేసింది. వేధింపులకు గురి చేయడమే కాకుండా సహేతుకమైన కారణాలు చూపకుండా అత్తమామల నుండి దూరంగా ఉండాలని భార్య ఒత్తిడి చేస్తుంటే.. అలాంటి భార్య నుండి విడాకులు కోరవచ్చని హైకోర్టు తేల్చి చెప్పింది. భారతీయ సాంప్రదాయం ప్రకారం తల్లిదండ్రులతో ఉండటంతో పాటు వారిని పోషించడం కొడుకు బాధ్యత అని, అది మన సంస్కృతి, సాంప్రదాయంలో ఓ భాగమని జస్టిస్ ఉదయ్ కుమార్, జస్టిస్ సౌమెన్ సేన్ ల బెంచ్ పేర్కొంది.తనకు తన భర్తకు విడాకులు మంజూరు చేస్తూ ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఇలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. పశ్చిమ మిద్నాపూర్ కు చెందిన ప్రశాంత్ కుమార్ మండల్ కు 2001లో ఝూర్నాతో వివాహం జరిగింది. ప్రశాంత్ ఓ పాఠశాలలో పార్ట్ టైం టీచర్ గా పని చేస్తున్నాడు. దాంతో పాటు బయట ట్యూషన్లు చెబుతుండే వాడు. తనకు వచ్చిన సంపాదనతో ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. అయితే అరకొర సంపాదనతో తల్లిదండ్రులతో ఉన్న ఆ కుటుంబాన్ని పోషించడానికి ఆదాయం సరిపోయేది కాదు. దీంతో భార్య వేరు కాపురం ఉందామంటూ ప్రశాంత్ పై ఒత్తిడి తీసుకురావడం మొదలు పెట్టింది. ఈ విషయంపై గొడవలూ జరుగుతుండేవి. ప్రశాంత్ ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న సమయంలోనే ఝూర్నా అతనిపైనా, అత్తమామలపైనా వేధింపుల కేసు పెట్టింది.ఆ కేసు వల్ల ప్రశాంత ప్రభుత్వ ఉద్యోగం పొందలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రశాంత్ తనకు విడాకులు ఇప్పించాలంటూ మిద్నాపూర్ లోని ఫ్యామిలీ కోర్టులో దరఖాస్తు చేసుకున్నాడు. విచారించిన కోర్టు ప్రశాంత్ కు, ఝూర్నాకు 2009లో విడాకులు మంజూరు చేసింది. దాన్ని సవాల్ చేస్తూ ఝూర్నా కలకత్తా హైకోర్టును ఆశ్రయించగా.. ధర్మాసనం ప్రశాంత్ కు అనుకూలంగా ఆమె పిటిషన్ ను కొట్టివేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది.కొన్ని రోజుల క్రితం కేరళ కోర్టు ముస్లిం మహిళల విడాకుల విషయమై సంచనల తీర్పు ఇచ్చింది. భర్త అంగీకారం లేకున్నా ముస్లిం మహిళలు విడాకులకు దరఖాస్తు చేసుకోవచ్చని కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఇస్లామిక్ చట్టం ప్రకారం ముస్లిం మహిళలు విడాకులు తీసుకోవడానికి భర్త అనుమతి అవసరం లేదని కోర్టు పేర్కొంది. వివాహాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసే ముస్లిం మహిళ హక్కును ఇస్లామిక్ చట్టం గుర్తిస్తుందని హైకోర్టు తెలిపింది. ఈ మేరకు జస్టిస్ మహమ్మద్ ముస్తాక్, జస్టిస్ సీఎస్ డయాస్‌లతో కూడిన ధర్మాసనం ఓ కేసులో 59 పేజీల తీర్పును ఇచ్చింది. "భర్త అంగీకారం లేకున్నా ముస్లిం మహిళలు విడాకుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ముస్లిం మహిళ ఎప్పుడైనా తన వివాహ బంధాన్ని బ్రేక్ చేయవచ్చు. పవిత్ర ఖురాన్ కూడా ఈ విధానాన్ని అంగీకరిస్తుంది. భర్త అంగీకారం ఉన్నా లేకున్నా విడాకులు తీసుకోవచ్చు." -కేరళ హైకోర్టు

## మార్కెట్‌లోకి కాంపా కోలా

(మొదటిపేజీ తరువాయి)

కాళీ ఎరేటెడ్ వాటర్ వర్క్స్‌లో మెజారిటీ వాటాను కొనుగోలు చేయడం కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్ చర్చలు జరిపింది. కాళీ ఎరేటెడ్ వాటర్ వర్క్స్ దక్షిణ భారతదేశంలోని ప్రముఖ శీతల పానీయాల బ్రాండ్ బోవోంటో తయారు చేసి, విక్రయిస్తోంది. దక్షిణ భారతదేశంలో ప్రజాదరణ పొందిన కోలా బ్రాండ్స్‌లో బోవోంటో ఒకటి, కోకా కోలా ఄ పెప్సీకి గట్టి పోటీ ఇస్తోంది. ఇది కాకుండా, నిమ్మ, ఆరెంజ్ ఫ్లేవర్ పానీయాలను కూడా కాళీ ఎరేటెడ్ వాటర్ వర్క్స్ తయారు చేస్తోంది. ఈ కంపెనీ జ్యూస్‌లు, కొబ్బరి నీళ్లను కూడా విక్రయిస్తుంది. కాళీ ఎరేటెడ్ వాటర్ వర్క్స్‌కు ఎనిమిదికి పైగా తయారీ ప్లాంట్లు ఉన్నాయి.
రిలయన్స్ - కాళీ ఎరేటెడ్ వాటర్ వర్క్స్ మధ్య ప్రతిపాదిత ఒప్పందానికి సంబంధించి చర్చలు తుది దశలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందం కుదిరితే, కాళీ ఎరేటెడ్ వాటర్ వర్క్స్ తయారీ ప్లాంట్లలో కాంపా కోలా తయారై, మార్కెట్‌ను ముంచెత్తుతుంది. కాళీ ఎరేటెడ్ వాటర్ వర్క్స్ తయారీ సామర్థ్యంతో పాటు బలమైన పంపిణీ వ్యవస్థ కూడా ఒకే ఒప్పందంతో రిలయన్స్‌కు దక్కుతుంది.

## జాతీయ స్థాయి ఆద్మీ పార్టీ గుర్తింపు పట్ల కేజ్రీవాల్ హర్షం

(మొదటిపేజీ తరువాయి)

నిజాయితీగా నిర్వహిస్తామని చెప్పారు.ఆమ్ ఆద్మీ పార్టీకి జాతీయ పార్టీ గుర్తింపును ఎన్నికల కమిషన్ సోమవారం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి కేజ్రీవాల్ సంబరాలు చేసుకున్నారు. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, జాతి వ్యతిరేక శక్తులతో పోరాడుతున్నందుకు జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశ ప్రగతిని అడ్డుకోవాలని కోరుకునే దేశ వ్యతిరేక శక్తులంతా ఆమ్ ఆద్మీ పార్టీకి వ్యతిరేకమని చెప్పారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జైలులో ఉన్న ఆ పార్టీ నేతలు సత్యేందర్ జైన్, మనీశ్ సిసోడియాలను గుర్తు చేశారు. జైలుకు వెళ్లడానికి భయపడేవారు పార్టీని వదిలిపెట్టాలన్నారు. భారత దేశాన్ని ప్రపంచంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు తమ పార్టీలో చేరాలని ప్రజలను కోరారు. తమకు దేవుని మద్దతు ఉందన్నారు.

## ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీలకు అనుమతి

(మొదటిపేజీ తరువాయి)

కోరింది. అయితే, నిషేధిత 'పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా' నుంచి దాడుల ముప్పు ఉందంటూ ఈ ర్యాలీలకు తమిళనాడు ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. దీంతో మద్రాసు హైకోర్టును ఆర్‌ఎస్‌ఎస్ ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు గత ఏడాది నవంబర్‌లో కొన్ని షరతులపై ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీలకు అనుమతి ఇచ్చింది. అయితే దీనిపై కూడా ఆర్‌ఎస్‌ఎస్ డివిజన్ బెంచ్‌కు వెళ్లడంతో ఎలాంటి షరతులు లేకుండా ర్యాలీలు నిర్వహించుకునేందుకు అనుమతిస్తూ డివిజన్ బెంచ్ ఈ ఏడాది ఫిబవరి 10న తీర్పు చెప్పింది.

## ఏపీలో ఈ- పాఠశాల

(మొదటిపేజీ తరువాయి)

ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా ఈ- కంటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది. దీన్ని ఏపీ ఈ?పాఠశాల, యూట్యూబ్, దీక్షా ప్లాట్‌ఫారం, ఐఎఫ్‌బీ ప్లాట్‌ఫారం, పీఎం ఈ?విద్య (డీటీహెచ్ చానెల్)లో అందుబాటులో ఉంచుతారు. ఈ నేపథ్యంలో ఒకే రకమైన కంటెంట్ ఉండేలా.. ఒకేలా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎవరికి నచ్చినట్లు వారు ఈ?కంటెంట్‌ను రూపొందించి యూట్యూబ్‌లో పెడుతున్నారు. దీనివల్ల విద్యార్థులు కొంత సంశయానికి లోనవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే అన్ని అధికారిక చానెళ్లలో ఎస్సీఈఆర్టీ, ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన ఈ?కంటెంట్‌ను అందుబాటులో ఉంచనుంది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో 4 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్ అందుబాటులో ఉంది. అయితే ఇది కేవలం మ్యాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్‌కు మాత్రమే పరిమితమైంది. విద్యార్థులు స్మార్ట్ ఫోన్ల ద్వారా ఈ?కంటెంట్‌ను అభ్యసించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలాగే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించింది. వీరు 10వ తరగతి వరకు ఈ?కంటెంట్ పాఠ్యాంశాలను ట్యాబుల్లోనే చదువుకోవచ్చు. అయితే బైజూస్ ద్వారా లాంగ్వేజ్ సబ్జెక్టులకు ఈ?కంటెంట్ లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యా, పరిశోధన శిక్షణ మండలి (ఎస్ఈసీఆర్టీ) ద్వారా తెలుగు, హిందీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ సబ్జెక్టులకు కూడా ప్రభుత్వం ఈ?కంటెంట్‌ను సిద్ధం చేయిస్తోంది. ఇందులో భాగంగా ముందు 8వ తరగతిలో లాంగ్వేజ్ సబ్జెక్టులకు ఈ-కంటెంట్‌ను రూపొందిస్తున్నారు.

## నేడు శ్రీశైలంలో కుంభోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

ఏకాంత సేవ నిలుపుదల చేశారు.
తరువాత సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతిని సమర్పించడంతో ఉత్సవంలోని ప్రధాన ఘట్టం ప్రారంభమవుతుంది. తరువాత రెండో విడత సాత్మిక బలి సమర్పించబడుతుంది.చివరగా అమ్మవారికి ప్రత్యేక పూజలను చేసి పిండివంటలతో అమ్మవారికి మహానివేదన చేయడం జరుగుతుంది. కాగా ఈ ఉత్సవంలో భాగంగానే గ్రామదేవత అంకాళమ్మకు కూడా ఈ ఉదయం ప్రత్యేక పూజలను నిర్వహించారు.

# ఏపీలో స్టిక్కర్ వార్...

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్‌లో వినూత్నంగా ప్రత్యేక కార్యక్రమానికి అధికార వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టింది. మా నమ్మకం నువ్వే జగన్ పేరుతో చేపట్టిన కార్యక్రమాన్ని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసన సభ్యులు, ఇంచార్జ్‌లు, నాయకులు జోష్‌తో నిర్వహిస్తున్నారు. జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా 'మెగా పీపుల్స్ సర్వే'కు అపూర్వ స్పందన లభించటంతో ఆ పార్టీకి చెందిన నాయకుల్లో ఉత్సాహం కనపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజామద్దతు పుస్తకంలో 21 లక్షలకు పైగా కుటుంబాలు పాల్గొని సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమాభివృద్ధి పాలనకు సంబంధించి వారి స్పందనలను నమోదు చేశారు. ఇప్పటి వరకు జగనన్నకు మద్దతు తెలుపుతూ 82960-82960 నంబర్‌కు 15 లక్షల పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి అధికారికంగా ప్రకటించింది. ప్రజలకు గత ప్రభుత్వానికి ఇప్పటి ప్రభుత్వానికి తేడా తెలియ చేస్తూ ఐదు ప్రశ్నలు అడుగుతున్నారు. ప్రతి ఇంటికి వెళ్ళినపుడు వారి అనుమతితో జగన్ ఫోటో ఉన్న స్టిక్కర్ కూడా అంటిస్తున్నారు. నచ్చితే స్టిక్కర్ గోడకు అంటించుకోవచ్చు. అదే విధంగా సెల్ ఫోన్ పై కూడా అంటించే స్టిక్కర్ లను పంపిణి చేస్తున్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన సర్వే కార్యక్రమంపై రాజకీయాల్లో చర్చనీయాశంగా మారింది. కోటి 60లక్షల ఇళ్ల దగ్గరకు వెళ్లి ప్రజల అభిప్రాయం తీసుకునే పనిలో ఉన్నారు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నేతలు. అధికార పార్టీకి చెందిన నాయకులు స్టిక్కర్‌ల పంపిణికి ప్రతిపక్షాలు కూడా కౌంటర్ కార్యక్రమాన్ని తలపెట్టాయి. మా ఖర్మ నువ్వే జగన్...మా కొద్దు జగన్ అంటూ పోటీ స్టిక్కర్‌లను కూడా పంపిణి చేస్తున్నాయి. జగన్ కు సంబంధించిన స్టిక్కర్ ఎక్కడ ఉన్నా.. దానికి పక్కనే ప్రతిపక్ష పార్టీకి చెందిన స్టిక్కర్‌ను వేసేస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాశంగా మారింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ కౌంటర్ స్టిక్కర్‌లు వేస్తున్నారు. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి విఫలమైన అంశాలు, గంజాయి వంటి మత్తు పదార్ధాల రవాణా, శాంతి భద్రతల వైఫల్యాలు, జీవో నెంబర్ వన్ ను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంపై వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు మండిపడుతున్నారు. అధికారంలో ఉండగా ఏమి చేయలేని తెలుగు దేశం పార్టీ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పాలనలో సాధించిన విజయాలపై అక్కసు వెల్లగక్కుతోందని అంటున్నారు. ఇలాంటి ప్రచారం చేయటం దుర్మార్గమని ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. సమానత్వం దిశగా అడుగులు వెయ్యడంలో సీఎం జగన్ నాలుగేళ్లు పూర్తి చేసుకున్నారని, సంతృప్తి చెందారు కాబట్టి ప్రజలు ఆశీస్సులు ఇస్తున్నారని అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదంతో వైఎస్‌ఆర్‌సీపీ లీడర్లు జనంలోకి వెళ్తుంటే మంచి స్పందన వస్తోందన్నారు. ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందించిందన్న విషయాన్ని గుర్తించారన్నారు. ఈ ఏడాది సంక్షేమ క్యాలెండర్ ఇప్పటికే జగన్ ప్రకటించారని, భవిష్యత్‌లో ఇది కొనసాగుతుందన్నారు. గత ప్రభుత్వం ఇప్పటి ప్రభుత్వానికి మధ్య తేడా గుర్తించే విధంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు.

# ప్రాణాలు తీస్తున్న అక్రమ సంబంధాలు

**కర్నూలు:**

అసలే అతడికి భార్యపై అనుమానం. ఎలాగూ అనుమాన పడుతున్నాడని.. ఆమె మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలుసుకున్న భర్త వేధింపులు మరింత అధికం అయ్యాయి. దీంతో విసిగి వేసారిన భార్య ప్రియుడితో కలిసి భర్త హత్యకు ప్లాన్ చేసింది. పథకం ప్రకారం ఫుల్లుగా మద్యం తాగించి రైలు వచ్చే ముందు రైలు పట్టాలపై పడుకోబెట్టారు. ఈ క్రమంలోనే అతడి తల పూర్తిగా పగిలిపోయి అక్కడికక్కడే చనిపోయాడు. ఈ తర్వాత ఏమీ తెలియనట్లు భర్త కనిపించడం లేదని పోలీసులకు సమాచారం అందించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన 35 ఏళ్ల ఉప్పర నారాయణ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య వరలక్ష్మి కూడా ఉంది. అయితే కొంతకాలం నుంచి నారాయణ భార్య వరలక్ష్మిని అనుమానిస్తున్నాడు. ఈ క్రమంలోనే రోజూ ఫుల్లుగా మద్యం తాగి వచ్చి భార్యను శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. అయితే భర్త వేధింపులు తాళలేని ఆమె.. సి.బెళగల్ మండలం మారందొడ్డి గ్రామానికి చెందిన చిన్న గోవిందుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. తరచుగా అతడిని కలిసి తన సమస్యలు చెప్పుకునేది. అయితే భర్త వేధింపులు ఆగాలంటే అతడిని హత్య చేయడం ఒక్కటే దారి అని.. అతడితో కలిసి ప్లాన్ చేసింది. పథకం ప్రకారం చిన్న గోవిందు.. నారాయణను కర్నూలుకు తీసుకెళ్లాడు. ఫుల్లుగా మద్యం తాగించాడు. అనతరం అతడిని తీసుకెళ్లి రైలు పట్టాలపై పడుకో బెట్టాడు. ఈ క్రమంలోనే అతడి పైనుంచి రైలు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నారాయణ తల పగిలిపోయింది. తీవ్ర గాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. చిన్నగోవిందు ఈ విషయాన్ని వరలక్ష్మికి ఫోన్ చేసి చెప్పాడు. మరుసటి రోజు అంటే గతేడాది జూన్ 30వ తేదీ తన భర్త కనిపించడం లేదని వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే వరలక్ష్మిపై కాస్త అనుమానం రావడంతో.. ఆమె సెల్ ఫోన్ కాల్స్ వివరాల ఆధారంగా పలువురిని అదుపులోకి తీసుకొని విచారించారు. భార్య వరలక్ష్మితో పాటు చిన్న గోవిందును గట్టిగా ప్రశ్నించగా.. తామే ఈ హత్య చేసినట్లు వెల్లడించారు. అయితే అనుమానంతో తాగొచ్చి వేధించడం వల్లే తాను భర్తను చంపాల్సి వచ్చినట్లు వరలక్ష్మి తెలిపింది. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితులు ఇద్దర్నీ అరెస్ట్ చేసి ఎమ్మిగనూరు న్యాయస్థానంలో హాజరు పరిచారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాస మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లె, విద్యానగర్ లోని ఓ అపార్ట్మెంట్లో ఢిల్లీ బాబు(48), అతని భార్య హేమలత(45)లు నివాసం ఉంటున్నారు. అయితే ఢిల్లీబాబు.. నెల్లూరు మండలంలోని గాండ్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు. హేమలత కొంగారెడ్డిలోని ఆర్కే మోడల్ స్కూల్ ప్రైవేట్ స్కూల్ లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. వీరి అన్యోన్య దాంపత్యానికి ప్రతీకలుగా ముగ్గురు కుమారులు ఉన్నారు. అయితే కొడుకులను ఉన్నత చదువులు చదివిస్తూ ఇంత కాలం వీరు హాయిగా జీవించారు. అయితే గత కొంత కాలంగా భార్య హేమలతపై ఢిల్లీ బాబు అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఆమెతో తరచుగా గొడవ పడుతున్నాడు. చిన్న చిన్న కారణాలకే భార్యను నోటికి వచ్చినట్లు దూషిస్తూ.. చిత్రహింసలు పెడుతున్నాడు. ఎవరితో మాట్లాడినా వారితో భార్యకు అక్రమ సంబంధాన్ని అంటగట్టేవాడు ఢిల్లీబాబు. హేమలత పని చేసే ప్రైవేటు స్కూల్ వద్ద కాపు కాసి మరీ ఆమెను మానసికంగా వేధించేవాడు. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో భార్యపై కక్ష పెంచుకున్న ఢిల్లిబాబు భార్యను హత్య చేసేందుకు పక్కాగా ప్లాన్ వేశాడు. అనుకున్న ప్లాన్ ప్రకారం శుక్రవారం సాయంత్రం ముగ్గురు కుమారులను బంధువుల ఇంటికి పంపాడు. ఆ తర్వాత భార్యపై కత్తితో దాడి చేసి అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. రక్తపు మడుగులో కొట్టుమిట్టులాడుతున్న భార్య చనిపోయేవరకు చూస్తూ పైశాచిక ఆనందం పొందిన ఢిల్లీ బాబు ఆతర్వాత తన మొబైల్ ఫోన్ ను స్విచ్ ఆఫ్ చేసి పరార్ అయ్యాడు. అయితే శనివారం ఉదయం ఎంతకీ బయటకు రాకపోయే సరికి అనుమానం వచ్చిన అపార్మెంట్ వాసులు వీరి ఇంట్లోకి వచ్చి చూశారు. చనిపోయి రక్తపుమడుగులో పడి ఉన్న హేమలతను చూసి భయపడిపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు.. కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం హేమలత మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడు ఢిల్లీ బాబు కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ శ్రీనివాస మూర్తి వెల్లడించారు. అయితే తల్లి హత్య వార్త తెలుసుకున్న కుమారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అనవసరంగా అనుమానం పెంచుకున్న తండ్రి.. తమకు అమ్మ లేకుండా చేశాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# 19న పోర్టుకు శంకుస్థాపన

**శ్రీకాకుళం:**

మేజర్ ప్రాజెక్ట్‌లు శ్రీకాకుళం జిల్లాకు రావడం లేదనే ఆవేదన జిల్లావాసుల్లో ఉంది. దశాబ్దాలుగా భావనపాడు పోర్ట్ ఎన్నికల హామీగానే మిగిలింది. శ్రీకాకుళం జిల్లా ప్రజల దశాబ్దాల కల భావనపాడు పోర్టు నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఈనెల 19వ తేదీన మూలపేట పోర్ట్‌కు సీ ఎం శంకుస్థాపన చేయనున్నారు. పోర్ట్ నిర్మాణం ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుంది. శ్రీకాకుళం జిల్లాకు తలమానికమైన ప్రాజెక్ట్ మూలపేట పోర్ట్‌తో ఉపాధి, ఉద్యోగ అవకా శాలు లభిస్తాయని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఏప్రిల్ 19 వతేదీన పోర్ట్‌తో పాటు వంశాధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రోజెక్ట్, బలసల రేవు వంతెనలకు సీఎం శంకుస్థాపన చెయనున్నారు. మరోవైపు ఇప్పటికే పోర్టుకు సంబంధించిన భూసేకరణ పూర్తయింది. పోర్టుకు అవసరమైన భూములను మూలపేట గ్రామంలో ఎకరాకు రూ. 25లక్షలు చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసింది. వాటి ద్వారా నిర్వాసితులకు ప్రత్యేకంగా పునరావాస కాలనీ కోసం కె.నౌపడలో ఎకరా రూ.26లక్షలు వెచ్చిం చి అవసరమైన భూమిని కొనుగోలు చేసి సిద్ధం చేసింది. భావనపాడు పోర్టు కోసం 675.60 ఎకరాలను సేకరించింది ప్రభుత్వం. ఇందులో ప్రైవేటు భూములు 433.71ఎకరాలు కాగా, ప్రభుత్వ భూమి, కోస్టల్ తీరం కలిపి 241.89 ఎకరాలు ఉన్నాయి. రూ.3200కోట్లతో నిర్మాణం చేపట్టబోతున్న భావనపాడుకు సీఎం జగన్ శంకుస్థాపన చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.

# జేడీఎస్ కు మద్దతుగా బీఆర్ ఎస్

**బెంగళూరు:**

వచ్చే నెలలో కర్నాటకలోని అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్ రాష్ట్ర సమితి అధినేత సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ ఎన్నికల్లో జేడీఎస్‌కు మద్దతుగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఈ ఎన్నికల్లో ప్రచారం చేయనున్నారు. ఈ విషయాన్ని జేడీఎస్ అధినేత హెచ్‌డీ కుమారస్వామి వెల్లడించారు. ఈసారి కర్ణాటక ఎన్నికల్లో 59 స్థానాలు గెలిచి ముఖ్యమంత్రి అవుతానని కుమారస్వామి ధీమా వ్యక్తం చేశారు. అయితే కాంగ్రెస్, బీజేపీలో ఎవరితో పొత్తు పెట్టుకుంటారని విలేకరులు ప్రశ్నించగా..తాము ఏ పార్టీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసేది ముందుగా చెప్పలేమని కుమారస్వామి స్పష్టం చేశారు. జేడీఎస్ ఇప్పటికే 97 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించగా, కాంగ్రెస్ 165 మంది పేర్లను ప్రకటించింది. బీజేపీ అభ్యర్థుల జాబితాను ఇంకా ప్రకటించలేదు. ఇదిలా ఉండగా కర్ణాటకలో మే 10 న ఎన్నికలు నిర్వహించున్నారు. మే 13 న ఓట్ల లెక్కింపు చేయనున్నారు.

# పేకాడుతూ దొరికిపోయిన సీఐ, ఏఎస్సై అరెస్ట్

**తిరుపతి**

ఓ ఇంట్లో కొందరితో కలిసి పేకాడుతున్న సీఐ, ఏఎస్సై సహా 13 మందిని తిరుపతి పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం రాత్రి వీరిని అరెస్ట్ చేయగా, రెండు రోజుల తర్వాత నిన్న వీరి అరెస్టును పోలీసులు వెల్లడించారు. తిరుపతి రూరల్ మండలం రాఘవేంద్రనగర్లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని దానిని కొందరు పేకాట స్థావరంగా మార్చేశారు. అందులో కొందరు పేకాడుతున్నట్టు సమాచారం అందుకున్న తిరుచానూరు పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ సీఐ, ఓ ఏఎస్సైతోపాటు మరో 11 మందిని అరెస్ట్ చేశారు. అలాగే వారి నుంచి భారీగా నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో పలువురు అధికార పార్టీ నేతలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ కారణంగానే వారి వివరాలను వెల్లడించలేదన్న విమర్శలు వచ్చాయి. ఎస్పీ పరమేశ్వరరెడ్డి జోక్యం చేసుకోవడంతో అదే రోజు రాత్రి పట్టణంలోని తూర్పు పోలీస్ స్టేసన్లో ఏఎస్సైగా పనిచేస్తున్న జోగారావు, కార్పొరేటర్ ఆంజనేయులు, మరో 9 మందిపై కేసులు నమోదు చేశారు.

నిందితుల్లో నాగరాజు, డి.సురేశ్, కె.సురేష్, డి.కిరణ్ కుమార్, పి.కృష్ణారెడ్డి, బి.చెంచుముని, ఎన్.శ్రీనివాసులు, కె.మునిప్రసాద్, కె.రాధాకృష్ణ, కార్పొరేటర్ కె.ఆంజనేయులు, ఎస్.నరేంద్ర, ఏఎస్ఐ జోగారావు, సీఐ చంద్రశేఖర్లను నిందితులుగా చేర్చారు. మరో ఇద్దరు ప్రజా ప్రతినిధులను కేసు నుంచి తప్పించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి

# గన్నవరం నుంచి భారీగా కమలం ర్యాలీ

**విజయవాడ:**

ఇటీవలే భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరిన ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర పర్యటనకు డేట్ ఫిక్స్ అయ్యింది. ఈనెల 12వ తేదీన ఆయన విజయవాడకు రానున్నారు. అదే సమయంలో పలువురు పారిశ్రామికవేత్తలు బీజేపీలో చేరేందుకు ప్లాన్ చేస్తున్నామని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి విజయవాడ కేంద్రంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రానున్నారు. అందులో భాగంగానే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొనున్నారు. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామిక వేత్తలు కిరణ్ కుమార్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి రాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రిగా పని చేసిన కిరణ్ కుమార్ రెడ్డి ఇటీవల ఢిల్లీలో బీజేపీ పెద్దల సమక్షంలో కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఆయన రాకను పురస్కరించుకొని పార్టీ వర్గాలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి పెద్ద ఎత్తున రోడ్ షో నిర్వహించటంతో పాటుగా, పలువురు సీనియర్ మాజీ నేతలను ఈ సందర్భంగా పార్టీలోకి ఆహ్వానించే కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో బీజేపీ ఆంధ్రప్రదేశ్ లో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఆదరణ కూడకట్టుకునేందుకు ప్రయత్నాలు మెదలయ్యాయని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. బీజేపీ అమలు చేసిన సంక్షేమ పథకాలు తామే అమలు చేసినట్లు ఏపీ సీఎం జగన్ ప్రచారం చేసుకుంటున్నారంటూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణ మండిపడ్డారు. ఇప్పుడు ఏకంగా స్టిక్కర్లు వేసి ప్రజలను మాయ చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఆస్పత్రిలో ఐదు లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు ప్రధాని మోదీ అందించారని, అయితే రూపాయి ఇవ్వకుండా ఆరోగ్యశ్రీ పేరు పెట్టుకుని జగన్ స్టిక్కర్లను వేసుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఆరు వేలు ప్రధాని మోదీ ఇస్తే.. జగన్ రైతు భరోసా అని తన ఖాతాలో వేసుకున్నారని చెప్పారు. రేషన్ ఉచితంగా ఇస్తే.. ఇంటింటికీ బియ్యం అని స్టిక్కర్ వేశారని, పేదలకు సొంతిల్లు మోదీ కట్టిస్తే.. జగన్ సొంత స్టిక్కర్లను వేసుకున్నారని అన్నారు. నేను ఉన్నాను, నేను విన్నాను అన్న జగన్... జనాలకు చేసిందేమీ లేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ అని జగన్ గొప్పలు చెప్పుకున్నారని, జాబు లేదు, క్యాలెండర్ లేదని మండిపడ్డారు. డాబుగా స్టిక్కర్లను మాత్రం వేస్తున్నారని, ఉద్యోగులకు జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని విమర్శించారు. ఏ గ్రామానికి, పంచాయతీకి అయినా నిధులు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేంద్రం వేలకోట్లు ఇస్తే వాటిని మళ్లించారని, ఇప్పుడు ఎందుకు స్టిక్కర్లను వేస్తున్నారో... మీకు ఏ అర్హత ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో స్టిక్కర్ల ప్రభుత్వం నడుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం వనరులను పూర్తిగా దోచేశారని ఆరోపించారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఆధ్వర్యంలో ఇసుక దోపిడీ వెలుగులోకి తెచ్చామని, అన్ని వనరులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చెందిన నాయకులు దోచుకోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. మద్యం, మైనింగ్, ఇసుక మాఫియా ద్వారా రాష్ట్ర ఖజానాకు వెళ్లాల్సిన డబ్బు వారి సొంత జేబుల్లోకి ఎంత వెళుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కుటుంబ పార్టీల వల్ల రాష్ట్రం అన్నివిధాలా దివాళా తీసిందని, రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టు అయినా ఎందుకు కట్టలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు .కేంద్రం ఇచ్చే డబ్బులతో పనులు చేస్తూ... గొప్పగా స్టిక్కర్లను వేసుకోవటం శోచనీయమని, జగన్ ప్రభుత్వం అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. 2024 ఎన్నికలలో ఏపీలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి వంటి అనేక మంది సీనియర్ నాయకులు బీజేపీలోకి రావటం అభినం దనీయం అన్నారు. బీజేపీలో చేరిన కిరణ్ కుమార్ రెడ్డి ఈ నెల 12 వ తేదీన విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయానికి వస్తారని తెలిపారు. బూత్ కమిటీ సమావేశాలు ద్వారా బీజేపీ బలోపేతం అవుతుం దని అభిప్రాయపడ్డారు. కుటుంబ, అవినీతి పార్టీ నుంచి ఏపీని కాపాడాలంటే బిజెపినే ప్రత్యామ్నాయ పార్టీగా అవతరిస్తోందని చెప్పారు.

# సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే

## ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**జగిత్యాల**

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ హాలులో బీసీ సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో,పూలే జయంతికమిటీ సహకారం తో మహాత్మా జ్యోతిరావు పూలే 197 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలే స్ఫూర్తి తోనే దేశంలో ఎక్కడా లేని బీసీ సంక్షేమ పథకాలు తెలంగాణ లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో అమలు జరుగుతున్నారు. గురుకుల వ్యవస్థ లో సాధిస్తున్న పతకాలు జ్యోతిరావు పూలే స్ఫూర్తితో సీఎం.కేసీఆర్ అందించారన్నారు. అభివృద్ధి సంక్షేమ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం పని తీరుకు జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు లభిస్తున్నాయన్నారు. పూలే జయంతి కమిటీ కన్వెనర్ హరి ఆశోక్ కుమార్ తదితర బీసీ నేతలు కోరినట్లు జిల్లా కేంద్రంలో పూలే విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. తన వంతుగా రూ.లక్ష విగ్రహ ఏర్పాటుకు ఇస్తానన్నారు. జడ్.పి.చైర్మన్ దావా వసంత మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది అంటూ పూలే సేవలను

గుర్తు చేశారు. ఆనంతరంఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ బి.ఎస్.లత మాట్లాడుతూ కుల,లింగ వివక్షతకు తావు లేకుండా అన్ని వర్గాలకు విద్య అందాలని, విద్య ద్వారానే బలహీన వర్గాలు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని పూలే భావించారన్నారు. అంటరానితనం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి పూలే అన్నారు. మహిళలు చదువుకుంటేనే అసమానతలు తొలగిపోతాయని భావించి మొదట తన భార్య సావిత్రీబాయిని విద్యావంతురాలిని చేసిన గొప్ప ఆచరణ వాది అని కొనియాడారు. సమాజ పునర్నిర్మాణానికి పూలే చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆనంతరంజిల్లా లైబ్రరీ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ పూలే ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందిస్తున్నాయన్నారు. ఆనంతరం పూలే జయంతి కమిటీ జిల్లా కన్వీనర్‌టీబీసీ జేఏసీ అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ పూలే,సావిత్రీబాయిపూలే దంపతుల విగ్రహాలను జిల్లా కేంద్రము లో ఏర్పాటు చేయాలని,పూలే కు భారత రత్న జయంతిని బలహీన వర్గాలకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందనీ,బీసీ కులాలకు సామాజిక గౌరవం కోసం ఆత్మ గౌరవ భవనాలు నిర్మిస్తున్నారని,ఏటా దాదాపు 45 వేల కోట్ల తో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పతకాలు బీ.సి,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,మహిళా వర్గాల సమున్నతి కోసం ఉపయోగ పడుతున్నాయన్నారు. . వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలు ఈ అవకాశాలను అందిపుచ్చుకుని విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో మరింతగా ఎదగడమే పూలేకు నిజమైన నివాళులు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ,అడిషనల్ కలెక్టర్ (ఎల్.బి) మంద మకరందు ,మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్,పూలే జయంతి కమిటీ కన్వీనర్,టి బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,బీసీ సంక్షేమ అధికారి సాయి బాబా, కౌన్సిలర్ శ్రీ లత,వివిధ శాఖల అధికారులు ,వివిధ బీసీ కుల సంఘం నాయకులు ,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు .

## అమ్మవారికి అగ్గిపెట్టిలో చీరను సమర్పించిన భక్తుడు

**ఇంద్రకీలాద్రి**

ఇంద్రకీలాద్రి అమ్మవారికి ఒక భక్తుడు అగ్గిపెట్టలో చీరను సమర్పించాడు. ఆ చీర ఖరీదు 45 వేల రూపాయలు.ఐదు గ్రాముల బంగారం 10 గ్రాముల వెండితో పూర్తి పట్టు దారాలతో నేసిన చీర అమ్మవారికి సమర్పించాడు. తెలంగాణ రాష్ట్రం సిరిసిల్ల గ్రామం నుండి వచ్చి అమ్మవారికి అగ్గిపెట్టి లో బంగారపు చీరను చిన విజయ్ అనే భక్తుడు బహుకరించాడు. 100 గ్రామల బరువుతో బంగారం, వెండి కలబోసి చీరనే నేసారు.

## వారసంతలో నకిలి నోట్ల కలకలం

**నిర్మల్**



గుర్తుతెలియని వ్యక్తి 500 రూపాయల నోటుతో వచ్చి ఇరవై రూపాయల [illegible] కోనుక్కెల్లాడు.అది గమనించని కూరగాయలు అమ్మె వ్యక్తి నోటును జేబులో ఉంచి మిగితా చిల్లర ఇచ్చి ఆ వ్యక్తిని పంపించాడు.అదే వ్యక్తి మరో ఐదు వందల నోటుతో తిరిగి అదే కూరగాయలు అమ్మె వ్యక్తి వద్దకు రావడంతో అనుమానమొచ్చి నోట్లను గమనించగా అవి నకిలీవని తెలింది.దీంతో ఆ వ్యక్తిని పట్టుకోడానికి ప్రత్నించిన ఫలితం దక్కలేదు..దీంతో పోలీసులను ఆశ్రయించాడు ఆ యజమాని..ఇలా ప్రతీ వారం వారసంతలో ఎన్ని ఫేక్ నోట్లు చలామని అవుతున్నాయో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## కారు ఢీకొని విద్యార్ధిని దుర్మరణం

**తిరుపతి**



తిరుపతి జిల్లా సత్యవేడు లో రోడ్డు ప్రమాదం జరిగింది. పుత్తూరు చెన్నై జాతీయ రహదారిలోని నారాయణ వనం మండలంకేంద్రం నుంచి భీముని చెరువుకు వెళ్లే మార్గంలోని రహదారిపై సైకిల్ పై వస్తున్న యువతిని కారు ఢీకొంది. ఘటన సమయంలో ఆమె ట్యూషన్ కి వెళ్లి సొంతూరు బ్రాహ్మణ తాగేల్కి పై వస్తుంది. మృతురాలు సౌమ్య నారాయణవనం బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతూ పరీక్షలు రాస్తున్నది. సౌమ్య రోడ్డు దాటే సమయంలో ఈ రోజు ఉదయం 7 గంటలకు కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యార్థిని దుర్మరణం చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వేడేక్కిన విజయవాడ

**విజయవాడ**

మంగళవారం నాడు విజయవాడలో రాజకీయ వేడి పట్టింది. ఒకవైపు చలో విజయవాడ కార్యక్రమానికి వస్తున్న అఖిలపక్ష నేతల అరెస్టులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ఖండించారు. కడప పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చన్న మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి. ఇవాళ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కాసేపట్లో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద నుంచి చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించారు. మరో వైపు ఇవాల్టి నుంచి ప్రభుత్వ ఉద్యోగులు సెల్ ఫోన్ డౌన్ కార్యక్రమం ప్రారంభం లయింది. తమ డిమాండ్ల సాధనకు మలిదశ ఉద్యమ కార్యాచరణకు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు

## భార్యను కడతేర్చిన భర్త

**భద్రాద్రి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం వడ్లగూడెం లో దారుణం జరిగింది. సోమవారం నాడు అర్ధరాత్రి భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. భార్య మోనికను భర్త నాగేంద్రబాబు హతమార్చాడు. భర్త కావాలనే చంపాడని మోనిక కుటుంబ సభ్యులు ఆరోపించారు. దమ్మపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని దమ్మపేట ప్రభుత్వ హాస్పటల్ కి తరలించారు. మోనిక భర్త నాగేంద్ర బాబు ని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

## పందిని ఢీకొని వ్యక్తి దుర్మరణం

**చంద్రగిరి**

తిరుపతి జిల్లా పూతలపట్టులో విషాదం నెలకొంది. రోడ్డు పైకి హటాత్తుగా వచ్చిన పందిని ద్విచక్ర వాహన దారుడు ఢీకొని కింద పడిపోయాడు. ఘటనలో జంతువుతోపాటు ద్విచక్ర వాహన దారుడు మృతి చెందాడు. నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిలోని బోడింబాయి వద్ద ఘటన జరిగింది. తిరుపతి నుండి చిత్తూరుకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా పందిని ఢీ కొన్న ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. మృతుడు చిత్తూరుకు చెందిన గజపతి ( 42 ) గా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వ్యక్తిని పరిశీలించగా తలకు బలమైన గాయం కావడంతో అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ?? పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. చంద్రగిరి పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# హీట్ పెంచుతున్న విశాఖ స్టీల్ ప్లాంట్..

**విజయవాడ:**



విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్వహణకు సంబంధించి ఆహ్వానించిన బిడ్డింగ్‌లో తెలంగాణ ప్రభుత్వం పాల్గొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. సింగరేణి లేదా రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ లేదా నీటిపారుదల శాఖ తరఫున పాల్గొనే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. విశాఖఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ వైఖరిని వెల్లడించడంతో పాటు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం, తెలంగాణలో చేపట్టిన మౌలికవసతుల ప్రాజెక్టులకు ఉక్కును సమకూర్చుకోవడం వంటి లక్ష్యాలతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనల కోసం వెంటనే విశాఖపట్నం వెళ్లి అధ్యయనం చేయాలని ఉన్నతాధికారుల బృందాన్ని కేసీఆర్ ఆదేశించారని చెబుతున్నారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్ కార్మికుల నిరసనల్లో బీఆర్ఎస్ ఏపీ నేతలు పాల్గొనడం కూడా ఈ ప్రచారానికి బలాన్ని చేకూరుస్తోంది..ఈ వార్తలపై ఏపీ ప్రభుత్వం ఆచితూచి స్పందిస్తోంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయొద్దన్నది తమ స్టాండ్ అన్నారు ఏపీ పరిశ్రమలశాఖ మంత్రి అమర్నాథ్. స్టీల్ ప్లాంట్ పై మీడియాలో వస్తున్న వార్తలే తప్ప, ఇంతవరకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నుండి కానీ, తెలంగాణ ప్రభుత్వం నుండి గాని ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదన్నారాయన. అయితే, స్టీల్‌ప్లాంట్ బిడ్డింగ్‌లో తెలంగాణ సర్కార్ పాల్గొంటుందన్న వార్తలపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ కూడా స్పందించారు. ముందు నిజాం షుగర్ ఫ్యాక్టరీ, కాగజ్‌నగర్ పేపర్‌మిల్ తెరవాలన్నారు బండి. తెలంగాణ ప్రభుత్వం నిజంగా దీనిపై నిర్ణయం తీసుకుందా లేదా ఇదంతా ప్రచారమేనా అన్నది మరికొన్ని రోజుల్లో తేలనుంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ బిడ్డింగ్‌లో తెలంగాణ సర్కార్ పాల్గొంటుందన్న ప్రచారం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు ఆచితూచి స్పందించిన ఆంధ్రప్రదేశ్‌లోని అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకునే ప్రయత్నం తొలి దశ నుంచి వైసీపీ చేస్తోందన్నారు వైవీ సుబ్బారెడ్డి.. ప్రధాని వద్ద కూడా సీఎం జగన్మోహన్ రెడ్డి వైజాగ్ స్టీల్ ప్లాంట్ అంశాన్ని ప్రస్తావించారన్న ఆయన.. చట్టపరమైన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని స్టీల్ ప్లాంట్ కాపాడుకుంటాం.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ గురించి ఇప్పుడు మాట్లాడుతున్న నాయకులు పార్టీలు ఇంత కాలం ఏం చేశాయి ? అని నిలదీశారు..

# ఇంటర్ కాలేజీలు-నిబంధనలు గాలికి

**హైదరాబాద్:**

తెలంగాణ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నా కార్పొరేట్, ప్రైవేటు సంస్థలు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీలకు జూన్ 1 వరకు వేసవి సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయినా.. చాలా ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు సెలవులు ఉన్నప్పటికీ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తు న్నాయి. ఈ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు ముగిసిన వారం రోజుల తర్వాత తరగతులు ప్రారంభించి విద్యార్థులను హాజరు పరుస్తున్నారు. నగరంలోని దాదాపు అన్ని కార్పొరేట్ కళాశాలలు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించి మెరుగైన ఫలితాల కోసం తరగతులు నిర్వహిస్తున్నామని, తద్వారా విద్యార్థులు ద్వితీయ సంవత్సరానికి మెరుగ్గా ప్రిపేర్ అవుతారని పేర్కొన్నారుఈ కాలేజీలు పోటీ పరీక్షలకు కూడా తరగతులు నిర్వహిస్తు న్నాయి. పిల్లలను బలవంతంగా ద్వితీయ సంవత్సరం తరగతులకు హాజరవు తున్నారని, వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇతర కళాశాలల వద్దకు రాకుండా చేయడమే లక్ష్యంగా తరగతులు నిర్వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులను ద్వితీయ సంవత్సరంలో కొనసాగించాలని నిర్ణయించారు. చాలా మంది లెక్చరర్లు పరీక్ష పేపర్ మూల్యాంకనంలో నిమగ్నమై ఉన్నారు, అయితే ఇది ఉన్నప్పటికీ, తరగతులు నిర్వహిస్తున్నారుఇప్పటి వరకు ఏ కళాశాలపైనా బోర్డు చర్యలు తీసుకోకపోవడంతో యాజమాన్యం మనోధైర్యాన్ని పెంచింది. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం, జూన్ 1న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యాభ్యాసం ప్రారంభం అవుతుంది. జూనియర్ కళాశాలకు వేసవి సెలవులు ఏప్రిల్ 1న ప్రారంభమై మే 31 వరకు కొనసాగుతాయి. ఆ తర్వాత అక్టోబర్ 19 నుంచి అక్టోబర్ 25 మధ్య దసరా సెలవులు ఉంటాయి. బోర్డు 227 పని దినాలు మరియు 77 సెలవు/ఆఫ్ రోజులను ప్లాన్ చేసింది. వచ్చే విద్యా సంవత్సరంలో జూనియర్ కాలేజీలకు కనీసం 220 పనిదినాలు ఉండాలని ఆదేశించింది. అర్ధ-వార్షిక పరీక్షలు ఒక నెల తర్వాత నవంబర్‌లో 20 నుండి 25 వరకు మరియు జనవరి 13, 2024 మరియు జనవరి 16 మధ్య సంక్రాంతి సెలవులు ఉంటాయి. ఈ ఏడాది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీని మే చివరి వారంలో నిర్వహిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# అంబేద్కర్ విగ్రాహావిష్కరణకు భారీ ఏర్పాట్లు

**హైదరాబాద్:**



హైదరాబాద్ నడిబొడ్డున ఏర్పాటు చేస్తున్న అతిపెద్ద అంబేద్కర్ విగ్రహావిష్క రణకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని విగ్రహావిష్కరణ చేయనున్నారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు గడువు సమీపిస్తుండటంతో ఏర్పాట్లను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. హుస్సేన్ సాగర్ ఒడ్డున నిర్మించిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ పనులను తెలంగాణ మంత్రులు ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్ తదితరులు పరిశీలించారు.ఈనెల 14 న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్న దేశంలోనే అతిపెద్ద 125 అడుగుల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులు, విగ్రహావిష్కరణ కార్యక్రమ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ లతో పాటు పలువురు సీనియర్ అధికారులు పరిశీలించారు. విగ్రహావిష్కరణకు కేవలం 3 రోజులు మాత్రమే గడువు ఉండడంతో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రితో పాటు వీవీఐపీ లు పాల్గొనే విగ్రహ ఆవిష్కరణకి ఉపయోగించే కర్టెన్, సందర్శకులకు ప్రవేశం, బహిరంగ సభ నిర్వహణ స్థలం తదితర అంశాలను సంబంధిత అధికారులతో మంత్రులు కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్ రెడ్డి లు సమీక్షించారు.ఐమాక్స్ పక్కనే ఉన్న మైదానంలో ఏర్పాటు చేసే బహిరంగ సభకు దాదాపు 40 వేలకు పైగా ఛైర్లు వేయాలని సూచించారు. వివిధ జిల్లాల నుండి వచ్చే వాహనాల పార్కింగ్, ఆవిష్కరణానంతరం, అంబేద్కర్ విగ్రహాన్ని పెద్ద సంఖ్యలో ప్రజలు సందర్శిం చనున్నందున తగు క్యూ లైన్లు, పూల ను ఏర్పాటు చేయాలనీ అధికారులను సూచించారు.నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, ఎస్.సి డెవలప్మెంట్ కార్యదర్శి రాహుల్ బొజ్జా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, హైదరాబాద్ కలెక్టర్ అమయ్ కుమార్, ఎస్.సి డెవలప్మెంట్ శాఖ కమిషనర్ యోగితా రానా, మల్లేపల్లి లక్ష్మయ్య ఆర్ అండ్ బి అధికారులు పరిశీలించారు.విగ్రహా ఆవిష్కరణ కు సంబంధించి తుది మెరుగులు దిద్దుతూ చివరి దశ పనులు చకాచకా చేస్తున్నారు.హైదరాబాద్ ట్యాంక్ బండ్ ప్రాంతంలో 125 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న దేశంలోనే అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహం.. తెలంగాణకే ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.అంబేద్కర్ విగ్రహం.. ఎడమ చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని.. కుడి చేతిని ముందుకు చాచి చూపుడు వేలుతో గొప్ప ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్న బాబాసాహెబ్ విగ్రహం నెక్లెస్ రోడ్డులో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఒకవైపు రాష్ట్ర పరిపాలన కేంద్రమైన నూతన సచివాలయం.. మరోవైపు అమరుల స్మారకం, అంబేద్కర్ భారీ విగ్రహం.. హైదరాబాద్ కు మణిహారంగా నిలవనున్నాయి

## పోలీసులనుంచి తప్పించుకోవాడానికి యత్నం పంటకాలువలో మునిగి వ్యక్తి మృతి

**కాకినాడ**

తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గుమ్ములూరు వద్ద తోటల్లో కోడిపందాలపై పోలీసులు దాడి జరిపారు. పోలీసుల రాకను గమనించిన అక్కడి వారు పరుగులు పెట్టారు. పోలీసుల దాడి నుంచి తప్పించుకునేందుకు పరుగు పెట్టిన వ్యక్తి మృతి చెందాడు. మహేష్ రాజా (31) వంటకాల్వలో దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. ఒక కానిస్టుబుల్ మునిగిపోతున్న వ్యక్తిని కాపాడేందుకు ప్రయత్నించినా ప్రయోజం లేకుండాపోయింది. పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానికులు, మృతుడి బంధువులు పోలీసుల తీరుపై మండిపడుతున్నారు.

## ఎమ్మెల్యేను అడ్డుకున్న గిరిజనులు

**రంపచోడవరం**

బోయలను ఎస్టి జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం 24న అసెంబ్లీలో తీర్మానం చేస్తుంటే అల్లూరి సీతారామ రాజు జిల్లా రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి వ్యతిరేకించకుండా సహకరించారని ఆదివాసీ గిరిజన సంఘాలు మండిపడ్డాయి. ఎమ్మెల్యే ధనలక్ష్మి రంపచోడవరంలోని మారే డుమిల్లిలో మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమానికి వెళ్తుండగా గిరిజన సంఘాలు గిరిజ నులు మారేడుమిల్లి ప్రధాన రహ దారిపై ఎమ్మెల్యేను నిరసనలతో అడ్డుకున్నారు.దింతో అక్కడ ఉద్రికత ఏర్పడింది.

## పూలేకు నివాళులు

**సర్పవరం**



సామాజిక విప్లవకారుడు పూలే తొలి తరం సామాజిక విప్లవకారుడు అయిన జ్యోతిరావు పూలే విపక్షతను, సాంఘిక దోపిడీని, [illegible] వ్యతిరేకించారని విశ్రాంతి తాసిల్దార్ రేలంగి బాపిరాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలో ఆయన జన్మించారని అన్నారు. అంబేద్కర్ వంటి ఎందరో మహనీయులకు పూలే జీవితం స్ఫూర్తి నింపిందని అన్నారు. సర్వ మానవ సమతా భావన ,కర్తవ్య దీక్ష, నిరాడంబర వేషధారణ, పేదల పట్ల ప్రేమ వంటి భావాలు, గుణాలు గల వ్యక్తి పూలే అని అన్నారు. వితంతువులు, అనాధ పిల్లల కోసం దేశంలోని తొలిసారిగా శరణాలయాన్ని ఆయన స్థాపించారని బాపిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కాలిన గాయాలతో మహిళ

**రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లో దారుణం జరిగింది. అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 133 వద్ద మహిళను దుండగులు తగులబెట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఒంటి పై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. పూర్తిగా కాలిపోయిన మహిళ రోడ్డు పై పడి పోయింది. రాజేంద్రనగరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. తన భర్త తగలబెట్టాడని బాధితురాలు అంటోంది. భర్త తగులబెట్టాడా? లేక తానే తగులబెట్టు కుందా అనే కోణం లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహిళ అత్తాపూర్ వాసి శివాని గా గుర్తించారు.

## విద్యార్థిని చితకబాదిన టీచర్

**భువనగిరి**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఒక విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదాడు. ఘటనలో విద్యార్ది చేయి చిట్లింది. విద్యార్థులు గొడవ చేస్తున్నారన్న నెపంతో సహనం కోల్పోయి ఉపాధ్యాయుడు విచక్షణారహితంగా కొట్టాడు. విద్యార్థి తల్లిదండ్రులు ఆలస్యంగా విషయం తెలుసుకున్నారు. పాఠశాలకు వచ్చి నిలదీసారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## వేట కొడవలితో దాడి

**ఖమ్మం**

భూవివాదం నేపథ్యంలో వేట కొడవలితో దాడి చేసిన సంఘటన రగునాధపాలెం మండలం వేపకుంట్లలో జరిగింది. వేపగుంట్ల కు చెందిన చిర్రా వెంకటేశ్వర్లు గతంలో మూడు కుంటల ఇళ్ల స్థలం కొనుగోలు చేశారు. ఆ స్థలం కొనుగోలు చేయాలని ఆశించిన కూరాకుల బాలకృష్ణ నిరుత్సాహానికి గురై తరచూ వెంకటేశ్వర్లు కుటుంబంతో గొడవ పడుతుండేవాడు. స్వల్ప వివాదంతో వెంకటేశ్వర్లుపై బాలకృష్ణ కర్రతో దాడి చేశాడు. బంధువు పరిటాల శ్రీనివాస రావుతో కలిసి ద్విచక్ర వాహనంపై మంచినీళ్ళు తెచ్చేందుకు వెళ్లిన వెంకటేశ్వర్లుపై బాలకృష్ణ దారి కాచి వేట కొడవలితో దాడి చేశాడు. వెనుక ఉన్న శ్రీనివాసరావు కేకలు వేయడంతో బాలకృష్ణ పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును 108లో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# కోటంరెడ్డి మాత్రమే యాక్టివ్

**నెల్లూరు:**



వైసీపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు సస్పెన్షన్ కు గురయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. అయితే నలుగురిలో ఒక్కరు మాత్రమే యాక్టివ్ గా ఉన్నారు. మిగిలిన వారు నియోజకవర్గాలకు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఒక్కొక్కరికి ఒక్కో కారణం. కారణాలు ఏదైనా నియోజకకవర్గానికి దూరంగా ఉంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు కూడా చేపట్టడం లేదు. కానీ నలుగురు సస్పెండ్‌కు గురైన ఎమ్మెల్యేల్లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒక్కరే నియోజకవర్గంలో యాక్టివ్‌గా ఉన్నారు. ఆయన వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచే పోటీ చేసేందుకు అన్ని రకాలుగా సిద్ధమవ్వడంతో అధికార పార్టీకి వ్యతిరేకంగా కార్యక్రమాలను చేపడుతున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రం నియోజకవర్గంలో యాక్టివ్ గా ఉన్నారు. ఆయన ప్రజాసమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతానని చెబుతున్నారు. త్వరలో వంతెన నిర్మాణం కోరుతూ జలదీక్ష చేస్తున్నానని కోటంరెడ్డి ప్రకటించారు. ఇప్పటికే తన సోదరుడు కోటంరెడ్డి గిరధర్ రెడ్డిని తెలుగుదేశం పార్టీలో చేర్చిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రం తాను వచ్చే ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. కార్యకర్తల సమావేశంలో కోటంరెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు అప్పట్లో వైరల్ అయిన తర్వాతనే వైసీపీ అధినాయకత్వం రూరల్ ఇన్‌ఛార్జిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నియమించింది. ఇక ఆనం రామనారాయణరెడ్డిపై కూడా సస్పెన్షన్ వేటు పడింది. ఆయన తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వెంకటగిరి నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు. సస్పెన్షన్ వేటు వేసిన నాటి నుంచి హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయం. అదీ టీడీపీ నుంచే. అది కూడా కన్ఫర్మ్. అయితే వెంకటగిరి నుంచి కాకుండా ఆత్మకూరు నియోజకవర్గం నుంచి బరిలోకి దిగాలని ఆనం రామనారాయణరెడ్డి ఆలోచన. టీడీపీ అధినాయకత్వం కూడా ఆత్మకూరులో సరైన నాయకత్వం లేకపోవడంతో ఆనంకు అక్కడే అవకాశమివ్వనుంది. ఈ నేపథ్యంలో ఆయన నియోజకవర్గంలో మాత్రం యాక్టివ్‌గా లేరు. త్వరలోనే ఆయన నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఆయన మరికొన్ని డిమాండ్లను టీడీపీ హైకమాండ్ ముందు ఉంచి సాధించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు కనపడుతుంది. ఇక మరో సస్పెండ్‌కు గురైన ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి మాత్రం రాజకీయంగా దూరమయ్యేటట్లే కనిపిస్తుంది. తొలి రోజుల్లో ఉదయగిరిలో కొంత హల్‌చల్ చేసిన మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి తాను ఇండిపెండెంట్ తర్వాత సోదరుడు మేకపాటి రాజమోహన్ రెడ్డి సూచన, హెచ్చరికతో ఒకింత మెత్తపడినట్లే కనిపిస్తుంది. ఆరోగ్యం కూడా తనకు సహకరించడం లేదని, వచ్చే ఎన్నికల్లో పోటీ చే?స్తానో లేదో తెలియదని కూడా చెబుతున్నారు. వరసగా గుండె సంబంధిత జబ్బులు రావడంతో మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు కూడా రాజకీయాలకు స్వస్తి చెప్పమని వత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయన ఈ ఏడాది మాత్రమే ఎమ్మెల్యేగా కొంత హడావిడి చేసి తర్వాత రాజకీయాల నుంచి తప్పుకోవాలని చూస్తున్నారు. ఈ విషయంపై ఆయన త్వరలో సన్నిహితులకు క్లారిటీ కూడా ఇస్తారని తెలిసింది. టీడీపీ కూడా మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు సముఖంగా లేకపోవడమే ఇందుకు కారణంగా చెప్పాలి. శ్రీదేవికి మాత్రం దారి... మరో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి టీడీపీ హైకమాండ్ నిర్ణయం కోసం ఎదురు చూడటం తప్ప మరో దారి లేదు. ఎందుకంటే ఆమెకు నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత ఉంది. అందుకే వైసీపీ హైకమాండ్ ఆమెకు సీటు నో అని ముందుగానే చెప్పేసింది. తాడికొండ నియోజకవర్గం టిక్కెట్ టీడీపీ ఇచ్చే అవకాశం లేదు. టీడీపీ ఇప్పటికే పొత్తులు కుదుర్చుకోవడానికి ప్రయత్నిస్తుంది. జనసేన, బీజేపీ, కమ్యునిస్టులతో పొత్తులు కుదిరితే ఉండవల్లి శ్రీదేవికి ఎక్కడా టిక్కెట్ లభించే ఛాన్స్ లేదు. అలా కాకుండా ఒంటరిగా పోటీ చేయాల్సి వస్తేనే ఎదైనా రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి శ్రీదేవికి చంద్రబాబు అవకాశమివ్వవచ్చు. లేదంటే అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ హామీ ఇచ్చి ఆమె చేత కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీకి వ్యతిరేకంగా ప్రచారం చేయించుకోవచ్చు. అంతే తప్ప.. ఉండవల్లి శ్రీదేవికి రాజకీయంగా మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది.

# భగభగమంటున్న సూరీడు

**హైదరాబాద్:**

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలో రెండు రోజుల పాటు తీవ్రమైన వేడిగాలులు ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది. ఉష్ణోగ్రతలు సాధారణ కంటే 2 నుండి 4 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ మంగళవారం 32 మండలాల్లో వేడిగాలులు వీస్తాయని హెచ్చరించింది. ముఖ్యంగా అనకాపల్లి, అల్లూరి, మన్యం, తూర్పుగోదావరి, ఏలూరు, కాకినాడ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. రానున్న వేడిగాలుల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఈ జిల్లాల్లోని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏడు మండలాల్లో విపరీతమైన వేడిగాలులు వీస్తాయని, ఉష్ణోగ్రత కనిష్ఠంగా 44 డిగ్రీల సెల్సియస్‌ను తాకుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అనకాపల్లి జిల్లాలోని ఐదు మండలాలు, తూర్పుగోదావరిలోని రెండు మండలాలు, కాకినాడలోని ఆరు మండలాలు, పార్వతీపురం జిల్లాలోని ఆరు మండలాల్లో కూడా వడగాలులు వీస్తాయని అప్రమత్తం చేశారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారులు (రాఆఓం) ఈ జిల్లావాసులు వడదెబ్బలు, ఇతర ఆరోగ్య సమస్యలను నివారించడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు విశాఖపట్నం నగరం గత రెండు రోజులుగా వేడిగాలులతో అల్లాడిపోతోంది. వేడిని తట్టుకునేందుకు ప్రజలు కూలెంట్లను ఆశ్రయిస్తున్నారు. కొబ్బరి, నిమ్మ, చెరకు రసం, ఐస్ యాపిల్స్ (ముంజేలు) తదితర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

# 14న మంచిర్యాలకు ఖర్గే

**అదిలాబాద్:**

మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్ రావ్ నేతృత్వంలో సభకు సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. మంచిర్యాల నియోజకవర్గంలోని నస్పూర్ మున్సిపాలిటీలో ఈనెల 14వ తేదీన కాంగ్రెస్ నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరు కానున్నారు. ఈ విషయాన్ని సభ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ వెల్లడించారు.
నస్పూర్ లో నిర్వహించే సభా మైదానంను సోమవారం వారు పరిశీలించారు. కొన్ని కారణాలతో వాయిదా పడుతూ వస్తున్న కాంగ్రెస్ భారీ బహిరంగ సభ ఈ నెల 14వ తేదీన ఖరారు అయినట్లు తెలిపారు. మల్లికార్జున్ ఖర్గే ఏఐసీసీ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తెలంగాణలో తొలిసారి మంచిర్యాలలో ఏర్పాటు చేస్తున్న సభకు హాజరవుతున్నట్లు వారు తెలిపారు. రాజ్యాంగ నిర్మాత బాఆర్ అంబేద్కర్ జయంతి రోజున సభను ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ సభ సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమవుతుందని ప్రేమ్ సాగర్ తెలిపారు. ఈ భారీ భహిరంగ సభకు రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ తో పాటు జాతీయ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, జైరాం రమేష్, కొప్పుల రాజు, పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, జాతీయ, రాష్ట్రీయ ముఖ్య నేతలు హాజరవుతారని వారు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని కొక్కిరాల ప్రేమ్ సాగర్, కొక్కిరాల సురేఖ పిలుపునిచ్చారు.

# హైదరాబాద్-బెంగళూరు వందేభారత్..?

**హైదరాబాద్:**

వరుసగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లను ప్రారంభిస్తున్నారు ప్రధాని నరేంద్రమోదీ. ఇటీవలే సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు పచ్చ జెండా ఊపారు. ఆ తరవాత చెన్నైలోనూ ఏ ట్రైన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. త్వరలోనే హైదరాబాద్-బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. దీనిపై పూర్తి వివరాలు ప్రస్తుతానికి తెలియకపోయినా. ..ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలోని బీజేపీ నేతలకు ఈ వివరాలు చెప్పినట్టు సమాచారం. గత వారం ప్రధాని హైదరాబాద్ పర్యటనకు వచ్చారు. అప్పుడే బీజేపీ నేతలతో ఈ విషయం చెప్పారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఇదే నిజమైతే తెలంగాణకు మూడో వందేభారత్ ట్రైన్ కూడా అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే సికింద్రాబాద్- విశాఖ, సికింద్రాబాద్ -తిరుపతి సర్వీస్‌లు అందుబాటులోకి వచ్చాయి. హైదరాబాద్-బెంగళూరు ట్రైన్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన చేయనున్నట్టు సమాచారం. అయితే..ఈ ఏడాది జనవరిలోనే సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు కీలక వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు నుంచి హైదరాబాద్‌లోని కాచిగూడ మధ్యలో సెమీ హైస్పీడ్ ట్రైన్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. మరో నెలలో ఎన్నికలకు వెళ్లనున్న కర్ణాటకలో బీజేపీ నేతలు ఇప్పటికే దీనిపై ప్రచారం కూడా చేస్తున్నారు. త్వరలోనే వందేభారత్ ట్రైన్ వచ్చేస్తుందని చెబుతున్నారు. సికింద్రాబాద్- తిరుపతి మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఇది తెలుగు రాష్ట్రాల మధ్య నడిచే రెండో వందేభారత్ ట్రైన్. ఇప్పటికే విశాఖ- సికింద్రాబాద్ మధ్య వందేభారత్ నడుస్తోంది. ఈ ట్రైన్ 130 కిలోమీటర్ల వేగంతో సికింద్రాబాద్ గూడూరు మధ్య ప్రయాణించనుంది. తెనాలి, నల్గొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు స్టేషన్లలో ఆగనుంది. సికింద్రాబాద్, తిరుపతి మధ్య 661 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ఈ దూరాన్ని వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఎనిమిదిన్నర గంటల్లోనే చేరుకుకుంటుంది. ప్రయాణికులు ఈ ట్రైన్ ఎక్కేందుకు స్లైడింగ్ ఫుట్‌స్టెప్‌లను, ఆటోమెటిక్ ప్లగ్ డోర్‌లను అమర్చారు. కోచ్‌ల మధ్య టచ్‌ఫ్రీ స్లైడింగ్ డోర్‌లను అమర్చారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన వాష్‌రూంలు సికింద్రాబాద్, తిరుపతి వందేభారత్ ట్రైన్‌లో ఉన్నాయి. ఈ ట్రైన్ ఉదయం ఆరు గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరనుంది. మధ్యాహ్నం రెండున్నర మూడు గంటల మధ్య తిరుపతి చేరుకుటుంది. అక్కడ 3.15కి బయల్దేరి రాత్రి 11.30 నుంచి పన్నెండు గంటల మధ్య సికింద్రాబాద్ చేరుకుంటుంది. విశాఖ- సికింద్రాబాద్ మధ్య నడిచే వందే భారత్‌కు ఆదివారం సెలవు అయితే... తిరుపతి- సికింద్రాబాద్ మధ్య నడిచే ట్రైన్‌కు మంగళవారం సెలవు దినంగా ప్రకటించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ స్లీపర్ వెర్షన్ కోసం రైల్వే బడ్జెట్ నుంచి రూ. 1800 కోట్ల కేటాయింపులకు ఆమోదించారు. వచ్చే రెండేళ్లలో, దేశంలోని వివిధ మార్గాల్లో ఈ వెర్షన్‌కు చెందిన 400 రైళ్లను పట్టాల పైకి తీసుకురానున్నారు. ఈ రైళ్లను తయారు చేసేందుకు ఐసీఎఫ్‌తోపాటు చాలా కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయని రైల్వే వర్గాలు తెలిపాయి. వార్తల ప్రకారం.. 400 రైళ్లలో, మొదటి 200 చైర్ కార్ రైళు ,, మిగిలినవి స్లీపర్ వెర్షన్. చైర్ కార్ రైళ్లు గరిష్టంగా 180 కి.మీ. వేగంతో నడిచేలా డిజైన్ చేస్తారని, కానీ 130 కి.మీ. వేగంతో నడుపుతారని తెలుస్తోంది.

# సంక్షేమ పథకాల ద్వారా భావి తరాలకు భరోసా

**విశాఖపట్నం**

సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షే మ పథకాల ద్వారా భవిష్యత్ తరాల కు భరోసా ఇస్తున్నారని, అన్నివర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని ఉమ్మడి విశాఖ వైయస్ఆర్‌సీపీ రీజ నల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందిస్తుండడంతో జగనన్నే మా భవిష్యత్తు అంటూ ప్రజలు ముఖ్యమంత్రికి నీరాజనాలు పలుకుతున్నారని తెలిపారు. విశాఖ జిల్లా తాటిచెట్లపాలెం అభయ ఆంజ నేయస్వామి ఆలయం దగ్గర యువ జన విభాగం జిల్లా అధ్యక్షులు ఆళ్ల శివ గణేష్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవి ష్యత్తు పేరిట యువ రథంను వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం పలు ఇళ్లను దర్శించిన వైవీ సుబ్బారెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి వారి సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అంద జేశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బా రెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల సంక్షే మాన్ని దృష్టిలో ఉంచుకొని పథకాల రూపకల్పన చేశారని అందుకే ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతు న్నాయని తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా గ్రామస్థా యిలోనే ప్రజల సమస్యలను తెలు సుకొని త్వరగా పరిష్కరించేలా చర్య లుతీసుకుంటున్నారని తెలిపారు.

# హ్యాట్రిక్ విక్టరీపై కేసీఆర్ ధీమా

**హైదరాబాద్:**



తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తి భరోసాగా ఉన్నట్లున్నారు. మూడోసారి కూడా తనదే విజయమన్న నమ్మకంతో ఉన్నారు. అందుకే పెద్దగా తెలంగాణ పాలిటిక్స్‌ను పెద్దగా పట్టించుకోవడం లేదు. ఈ ఏడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటి వరకూ గులాబీ బాస్ కార్యాచరణలోకి దిగలేదు. జిల్లాల పర్యటనకు దూరంగా ఉంటున్నారు. ఎప్పుడో ఒకరోజు హడావిడి చేయడం తర్వాత ప్రగతి భవన్‌కే పరిమితమవ్వడం మామూలయి పోయింది. పోనీ ప్రభుత్వంపై సానుకూలత ఎనలేనంత ఉందా? అంటే ఉందని ఖచ్చితంగా లేదని చెప్పలేం. ఎందుకంటే నిరుద్యోగులు, రైతులు, మహిళలు ఇలా అన్ని సామాజికవర్గాల్లో అసంతృప్తి ఉందని పలు సందర్భాల్లో బయటపడుతూనే ఉంది. మునుగోడు ఉప ఎన్నిక తర్వాత తిరిగి ప్రజల్లోకి వెళ్లేందుకు పెద్దగా ప్రయత్నాలు కేసీఆర్ చేయడం లేదంటున్నారు. ఆయన బీఆర్ఎస్ పార్టీగా మార్పు చేసిన తర్వాత దేశ రాజకీయాలపైనే దృష్టి పెట్టారు. తెలంగాణ రాజకీయాలను తన కుమారుడు మంత్రి కేటీఆర్, అల్లుడు మరో మంత్రి హరీశ్‌రావులుకు వదిలేశారు. వారిద్దరే జిల్లాల్లో జోరుగా పర్యటనలు చేస్తున్నారు. అంతే తప్ప పార్టీ అధినేత కేసీఆర్ మాత్రం తెలంగాణ ఎన్నికలపై ఇంకా సీరియస్‌గా దృష్టి సారించక పోవడం గులాబీ పార్టీలో హాట్ టాపిక్ గా మారింది. సార్వత్రిక ఎన్నికలకు పట్టు మని ఏడు నెలల సమయం కూడా లేదు. అయినా కేసీఆర్ ఎందుకు నిర్లిప్తత ధోరణిని వ్యవహరిస్తున్నారంటే ఆయన లెక్కలు ఆయనకున్నాయనే వారు లేకపోలేదు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును కాంగ్రెస్, బీజేపీలు చీల్చుకుంటే సులువుగా మూడోసారి అధికారంలోకి రాగలమన్న అతి విశ్వాసంతో కేసీఆర్ ఉన్నట్లు కనిపిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ, పదో తరగతి ప్రశ్నా పత్రాల లీకేజీలు ప్రభుత్వ అసమర్థతను బయటపెట్టేవిగా కనపడుతున్నాయి. దీని వల్ల ప్రభుత్వంపై ఉన్న రెపుటేషన్ దెబ్బతినిందనే చెప్పాలి. ఉద్యోగులు, నిరుద్యోగులు కూడా సంతృప్తికరంగా లేరు. ఆ విషయం తెలిసినా రెండు పార్టీలు వ్యతిరేక ఓటు చీల్చుకుంటే అనుకూల ఓటుతో గెలుపొందుతామన్న ధోరణి కేసీఆర్‌లో కనపడుతుంది. అందుకే బీజేపీ బలపడేలా ఆయన గత కొంతకాలంగా ప్రోత్సహిస్తూ వచ్చారు. కాంగ్రెస్ రాజకీయంగా ఇబ్బంది పడేలా చేశారు. ఇది రాజకీయంలో ఒక వ్యూహమే కావచ్చు. ఆయన స్ట్రాటజీతో సానుకూల ఫలితాలు రావచ్చు. అలాగని ప్రతికూల ఫలితాలు రావని ఖచ్చితంగా చెప్పలేం. ఎందుకంటే బీజేపీ పైకి బలంగా కనిపిస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో దాని పరిస్థితేంటో తెలియదు. 119 నియోజకవర్గాల్లో ఓటు బ్యాంకులేని బీజేపీ కాంగ్రెస్‌తో పోటీ పడుతుందా? చతికలపడుతుందా? అన్నది రానున్న ఎన్నికలు తేల్చి చెబుతాయి. అనుకున్న స్థాయిలో బీజేపీ బలంగా లేదన్నది మాత్రం వాస్తవం. అయితే కాంగ్రెస్ కూడా అంతే. క్షేత్రస్థాయిలో బలం ఉన్నా నేతల మధ్య ఐక్యత లేదు. అది కేసీఆర్‌కు అడ్వాంటేజీ. అలా కాకుండా ఇప్పుడు కాక మరింకెప్పుడు అని ప్రతి కాంగ్రెస్ నేత, కార్యకర్త అనుకుంటే తెలంగాణలో బీజేపీ కాంగ్రెస్ పార్టీకి పెద్ద లెక్క కాబోదు. కాంగ్రెస్ కనుక పుంజుకుంటే కేసీఆర్ కూడా రాజకీయంగా ఇబ్బంది పడక తప్పదు. ఎందుకంటే ఇది తెలంగాణ. రాజకీయ చైతన్యం ఎక్కువ. రెండుసార్లు అధికారంలో ఉన్న కేసీఆర్‌కు సహజంగానే అసంతృప్తి కొన్ని వర్గాల్లో ఉంటుంది. ఆ అసంతృప్తిని సమర్థవంతంగా కాంగ్రెస్ కనుక క్యాష్ చేసుకోగలిగి తమకు అనుకూలంగా మార్చుకోలిగితే చెప్పలేం. గుర్రం ఎగరా వచ్చు. కేసీఆర్ ఆశలు అడియాస కావచ్చు. హ్యాట్రిక్ విక్టరీ దూరం కావచ్చు. కానీ ఇవన్నీ జరగాలంటే.. చాలా జరగాలి. మరి అవి జరుగుతాయో? లేదో? అన్నది కూడా చూడాల్సి ఉంది.

# పగిలిన కొండ బరువు ఎంతో చెప్పిన అధికారులు

**కర్నూలు :**

జిల్లా గోనెగండ్లలోని ఎస్సీకాలనీలో ఎండల దెబ్బకు పగిలిపోయిన నర్సప్ప కొండ రాయికి అధికారులు కొలతలు వేశారు. కొండరాయి ఆరువేల టన్నుల బరువు, 50 అడుగుల ఎత్తు, 50 అడుగుల వెడల్పు ఉందని అంచనా వేశారు. ఈ కొండ రాయి 500 ఏళ్ల నాటిదని నిర్ధారించారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే తొలగింపు పనులు మొదలుపెట్టనున్నారు. రెండు రోజుల క్రితం నర్సప్ప కొండరాయి ఎండ ధాటికి బాంబు పేలిన విధంగా శబ్దం చేస్తూ పగిలింది. ఆ ప్రాంతంలో బహిర్భూమికి వచ్చిన కాలనీ వాసులు ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో భయాందోళనకు గురయ్యారు. ఆ తరువాత కొండ పగిలినట్లు గుర్తించిన స్థానికులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల క్రితం కొండకు వచ్చిన క్రాక్స్ క్రమం క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో కొండ క్రాక్స్ ఏమేరకు పెరుగుతుందనే దానిపై రెవెన్యూ అధికారులు దృష్టిపెట్టారు. కొండను టెక్నికల్ తొలగిస్తేనే ఎలాంటి ప్రమాదం ఉండదని అధికారులు అంచనాకి వచ్చారు. కొండ పక్కనే ఉన్న ఇళ్ల వైపు వాలినట్లు ఉన్న నేపథ్యంలో కొంచెం కదిలించినా ఇళ్లపై పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఇళ్ళ మీద పడే అవకాశం ఉండడంతో ఎస్సీ కాలనీని అధికారులు డేంజర్ జోన్‌గా ప్రకటించారు. కొండ రాళ్ళు పగిలిన ప్రదేశం చుట్టూ ఉన్న 50 ఇళ్లను ఖాళీ చేయించి వారికి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎస్సీ కాలనీవాసులకు గత రాత్రి పునరావాసం కల్పించారు. అయితే ప్రమాదకరంగా ఉన్న బండ రాయిని త్వరగా తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
కాగా... కొండరాళ్ల మధ్య పగుళ్లను సిమెంట్‌తో పూడ్చివేసి.. ఏటవాలుగా వాలిన కొండరాయికి కింది భాగంలో 12 అడుగుల వరకు ఐరన్ పోల్స్ సపోర్టుగా ఉంచి... ఖాళీ ప్రదేశంలో కాంక్రీట్ బెడ్‌తో పూడ్చాలని అధికారులు ఓ నిర్ణయానికి వచ్చారు. కొండ పూడ్చే పనులపై ఉన్నతాధికారుల దృష్టికి ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తీసుకెళ్లారు. ఈరోజు సాయంత్రానికి ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చే అవకాశం ఉందని.. అనుమతులు రాగానే పనులు మొదలుపెడతామని ఆదోని సబ్‌కలెక్టర్ తెలిపారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా కొండను తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు.

## సంగారెడ్డిలో మంత్రి హరీష్ రావు పర్యటన

**సంగారెడ్డి**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగడం ప్రజల్లో ఏర్పడుతున్న నమ్మకానికి నిదర్శనం అన్నారు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్రావు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రుల్లో 85 శాతం ప్రసవాలు చేయడంపై వైద్యులను మంత్రి అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గతంలో సమస్యలు లేవని, వాటిని వెనువెంటనే పరిష్కరిస్తామన్నారన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మంత్రి హరీశ్రావు విస్తృతంగా పర్యటించారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పూల మాల వేసి నివాళు లర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశంలో పాల్గొని పలు అంశాలపై రివ్యూ చేశారు. ఎంపి బిబి.పాటిల్తో పాటు ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, క్రాంతి కిరణ్, మాణిక్ రావు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే, కార్పొరేటర్ మధ్య ముదిరిన వివాదం

**హైదరాబాద్**

అంబర్ పెట్ లో ఎమ్మెల్యే, కార్పొరేటర్ మధ్య వివాదం ముదిరింది. అంబర్ పేట్ పూలే జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కు, గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య అమె భర్త దూసరి శ్రీనివాస్ గౌడ్ మధ్య వ్యాగ్వాదం నెలకొంది. దాంతో ఇరు వర్గాల కార్యకర్తలు గొడవకు దిగారు. మంగళవారం నాడు అంబర్ పేట నియోజకవర్గం లో జరిగిన జయంతి వేడుకలలో ఎమ్మెల్యే, గోల్నాక కార్పొరేటర్ పాల్గోన్నారు. పూలే విగ్రహానికి పూలమాల వేసే విషయంలో నన్ను ఎమ్మెల్యే నెట్టుకుంటూ వెళ్లారంటే నాపై దాడి చేశారంటూ కార్పొరేటర్ దూసరి లావణ్య, ఆమె భర్త శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. గత కొంత కాలం నుండి నియోజకవర్గం అభివృద్ధి పనుల్లో నన్ను ఇన్వాల్వ్ చేయడం లేదంటూ కార్పొరేటర్ ఆవేదన వ్యక్తం చేసింది. మా డివిజన్లో జరిగిన ఆత్మీయ సమ్మేళన సభలో మమ్ముల్ని అవమానించేలా ఎమ్మెల్యే వ్యవహరించారని ఆమె ఆరోపించారు.

## ఎంపీలకు ఆత్మీయ స్వాగతం పలికిన ఎమ్మెల్యే

**ఖమ్మం**



ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,బండి పార్థసారథి రెడ్డి,లోకసభలో బీఆర్ఎస్ పక్ష నాయకులు నామా నాగేశ్వరరావులకు ఆత్మీయ స్వాగతం పలికారు.సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు గాను ఖమ్మం నుంచి బయలుదేరిన ఎంపీలు నాయక్ ఆహ్వానం మేరకు వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొద్దిసేపు ఆగారు.ఎమ్మెల్యే నాయక్ ఎంపీలకు పుష్పగుచ్ఛమిచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎంపీలు వద్దిరాజు,బండి,నామాలు మహనీయులు పూలే చిత్ర పటానికి పూలు జల్లి ఆయన దివ్య స్మృతికి ఘన నివాళులర్పించారు.ఎంపీల గౌరవార్థం ఎమ్మెల్యే తేనీటి విందునిచ్చారు.

## మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం

**నంద్యాల**

నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూర్ గ్రామంలో సింగిల్ విండో చైర్మన్ మద్దూర్ హరి సర్వోత్తం రెడ్డి, బిజ్జుల ఉదయ్ కిరణ్ రెడ్డి, గుండ్రాల శ్రీనివాసులు, వంగాల జనార్ధన్ రెడ్డి, బిజ్జుల రాఘవేంద్ర రెడ్డి, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలను గురించి ఇంటింటికి తిరుగుతూ మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్లను ఇంటి గోడకు అతికించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఎంతో ఉత్సాహం కనపరచి సహకరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు దాసరి ఏసురత్నం, చంద్రకంటి మనో రాజు, వడ్డేమధు, పి. చాంద్, పి.మౌలాలి, బోయ ఈశ్వర్, మరియు వైయస్సార్ పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## జగనన్న మా భవిష్యత్తు మా నమ్మకం

**కౌతాళం**

జగనన్న మా భవిష్యత్తు మా నమ్మకం ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి అని వైసిపి నాయకులు గుర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అంటిస్తూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనేక సంక్షేమ పథకాలకు ప్రజలకు విద్యార్థులకు అందించడం జరిగిందన్నారు. ఇందులో అమ్మబడి, రైతు బరోస, జగనన్న తోడు, సచివాలయాలు ఏర్పాటు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు, వీటితో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్కు మరొకసారి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్ను కరపత్రాలను గ్రామ ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో రాఘవరెడ్డి శ్రీనివాసరెడ్డి జైపాల్ సచివాల సిబ్బంది వాలంటీర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీలో వర్గపోరు

**అదిలాబాద్:**

ఆదిలాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీలో వర్గపోరు భగ్గుమంది. బోథ్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీలో గ్రూపుల గోల తగ్గడం లేదు. గత కొన్ని రోజులుగా గ్రూపులు కొనసాగుతుండగా, ఆదివారం ఈ పోరు మరింత వేడెక్కింది. రెండు వర్గాలు పోటాపోటీ సమావేశాలు ఏర్పాటు చేసుకోవడంతో అటు కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ తమ సమావేశం అడ్డుకునేందుకు ప్రయత్నించారని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ వర్గం ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలో వర్గపోరు కొనసాగుతోంది. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ రెండుగా చీలింది. దీంతో రెండు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఎంపీపీ తుల శ్రీనివాస్ మధ్య వర్గపోరు కొనసాగుతోంది. ఈ విషయం గతంలో అధిష్టానం దృష్టికి వెళ్లడంతో వారికి నచ్చచెప్పారు. రెండు వర్గాల మధ్య ఎలాంటి విభేధాలు లేకుండా చూసుకోవాలని అధిష్టానం ఇద్దరికి నచ్చజెప్పింది. దీంతో చాలా రోజులుగా ఇరువర్గాల నేతలు సైలెంట్ అయ్యారు. అయితే, సర్దుకుంది అనుకున్న వర్గ పోరు ఆదివారం మళ్లీ తెరపైకి వచ్చింది.బోథ్ మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే బాపురావ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దానికి పోటీగా ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బోథ్ మండల కేంద్రంలోనే భరోసా పేరుతో మరో సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఒకే మండలం రెండు సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడంతో క్యాడర్ లో అయోమయం నెలకొంది. ఎంపీపీ తుల శ్రీనివాస్ తలపెట్టిన సమావేశాన్ని అడ్డుకోవడానికి ఎమ్మెల్యే ఫంక్షన్ హాల్ కి తాళం వేయించారు. దీంతో పరిచయ గార్డెన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుకి తుల శ్రీనివాస్ వర్గీయులు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ ఆవేశంతో నినాదాలు చేశారు.ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ.. బోథ్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాపురావ్ బీఆర్ఎస్ కార్యకర్తలకు చేసింది ఏమీ లేదని.. అందుకే పార్టీలో అసలైన కార్యకర్తలు అందరం ఎంపిపి తుల శ్రీనివాస్ వైపు నిలబడ్డామని స్పష్టం చేశారు. తన విలువ తగ్గుతుందని తమ సమావేశం అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే రూ. 2 లక్షలు ఇచ్చిన వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చారని దుయ్యబట్టారు. కార్యకర్తలు, నాయకుల అభీష్టం మేరకే సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ తుల శ్రీనివాస్ చెప్పుకొస్తున్నారు. ఎంపీపీ తుల శ్రీనివాస్ వెనుక పార్టీ సీనియర్లు ఉండి కథ నడిపిస్తున్నారని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ వర్గం ఆరోపిస్తోంది. ఎమ్మెల్యే అంటే లెక్కలేకుండా ఎంపీపీ తుల శ్రీనివాస్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం తగదని ఎమ్మెల్యే వర్గం నాయకులు హెచ్చరిస్తున్నారు. పోటా పోటీగా సమావేశాలు ఏర్పాటు చేయడం అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# తెలంగాణకు బీజేపీ నేతల క్యూ

**హైదరాబాద్:**

ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనకు వచ్చిన వేళ? అధికార బీఆర్ఎస్ ను ఓ రేంజ్ లోనే టార్గెట్ చేశారు. అవినీతి, కుటుంబపాలన అంటూ పరోక్షంగా కేసీఆర్ విమర్శనాస్త్రాలను ఎక్కుబెట్టారు. ఫలితంగా ఇరు పార్టీల మధ్య డైలాగ్ వార్ షురూ అయింది. ఇదే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతోంది తెలంగాణ. ఇప్పటికే ప్రధాన పార్టీలు నువ్వా -నేనా అన్నట్లు ముందుకెళ్తున్నాయి. అధికార బీఆర్ఎస్ మరోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తుంటే... ఇప్పటికే రెండుసార్లు అధికారానికి దూరమైన తెలంగాణ కాంగ్రెస్...ఈసారి ఎలాగైనా గెలిచాలని చూస్తోంది. ఇదిలా ఉంటే బీజేపీ మాత్రం... తెలంగాణపై సీరియస్ గా ఫోకస్ పెట్టేసింది. గత కొంతకాలంగా ఆ పార్టీ బలపడుతూ వస్తోంది. కీలమైన ఉపఎన్నికలతో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటిన కమలనాథులు... రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ జెండాను ఎగరవేయాలని చూస్తున్నారు. ఈ క్రమంలో అగ్రనేతలు కూడా వరుసగా రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. తాజాగా ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనకు వచ్చిన వేళ ఆ పార్టీ శ్రేణులు జోష్ లో ఉన్నాయి. తాజాగా ప్రధాని మోదీ హైదరాబాద్ టూర్ కి వచ్చిన నేపథ్యంలో బీజేపీ శ్రేణుల్లో సరికొత్త జోష్ నెలకొంది. ఇప్పటికే పలుమార్లు అమిత్ షాతో పాటు జేపీ నడ్డా వంటి అగ్రనేతలు వస్తున్నారు. ఇదే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో... ప్రత్యేక ఆపరేషన్ షూరు చేస్తున్నారు. ఇప్పటికే లిక్కర్ కేసు, పేపర్ లీకేజీ వంటి అంశాల్లో కూడా కమలనాథులు దూకుడుగా ముందుకెళు _న్నారు. తాజాగా బండి సంజయ్ అరెస్ట్ వ్యవహారం కూడా హాట్ టాపిక్ గా మారింది. కేసీఆర్ టార్గెట్ గా ఆ పార్టీ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. ఇదే సమయంలో అవినీతి, కుటుంబపాలన అంటూ అగ్రనేతలు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే.... మే నెలలో కూడా ప్రధాని మోదీ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. తాజాగా అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చినప్పటికీ. బీఆర్ఎస్ పేరు ఎత్తకుండానే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో... మరింత దూకుడు పెంచే దిశగా కూడా కమలనాథులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 90 స్థానాల్లో గెలుపు లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతుంది. మిషన్ 90 టార్గెట్ కూడా ఇదే..! ఇప్పట్నుంచే ప్రజల్లో ఉంటూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతంపై చూసే అంశాలపై ప్రధానంగా దృష్టి సారించింది. ఆయా నియోజకవర్గాల స్థానాల్లో బలమైన అభ్యర్థుల కోసం బీజేపీ హైకమాండ్ ఫోకస్ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే పార్టీ బలహీనంగా ఉన్న స్థానాల్లో చేపట్టాల్సిన చర్యలపై కూడా లోతుగానే చర్చిస్తోంది. ఈ సీట్లలో బలమైన అభ్యర్థులను తెరపైకి తీసుకురావటంతో పాటు పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యాచరణపై కూడా కసరత్తు చేస్తోంది.మొత్తంగా మరికొద్ది నెలల్లోనే ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో....బీజేపీ దూకుడు పెంచే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఎన్నికల వేడి మరింత పెరగనుంది. మరోవైపు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కూడా ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి.

# సామాజిక విప్లవకారుడు పూలే

**ఘనంగా 197వ జయంతి వేడుకలు**

**కాకినాడ:**

భారతదేశంలో తొలి సామాజిక, సాంఘిక విప్లకారుడు మహాత్మా జ్యోతిరావు పూలేనని ఆయన ఆశయ సాధనకు అందరూ కృషిచేసి ఆయన అడుగుజాడల్లో నడవాలని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. అలాగే మహిళా విద్యకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి తన భార్య సావిత్రిబాయి పూలేను ఉపాధ్యాయునిగా నియమించి ఆదర్శంగా ఆ ఇరువురు దంపతులు నిలిచారని సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి కూడలిలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన పిల్లి బోస్ పూలే గురించి వివరించారు. సుమారు 180 ఏళ్ల క్రితం చదువే వెనుకబాటు నుంచి విముక్తి చేయగలదని గ్రహించిన మేధావిగా పూలేని అభివర్ణించారు. ఆ కాలంలో అగ్రవర్ణాలుగా చలామణి అయ్యే మూడు కులాలకు మాత్రమే సకల సౌకర్యాలు, విద్యను పొందే వారన్నారు. ఆ మూడు కులాల వారు మినహా మిగిలిన అందరూ శూద్రులుగానే చూసేవారని, అటువంటి మూఢాచారాలకు వ్యతిరేకంగా ఎన్నో సామాజిక పోరాటాలు నిర్వహించి దేశంలో మహానుభావుడిగా పేరు సంపాదించారన్నారు. పూలే చరిత్రను బ్రిటన్కు చెందిన ఒకరు తెలుసుకొని అతను రచనల ద్వారా పూలే జీవితాన్ని లిఖించారన్నారు. విద్య ఒకటే వెనుకబాటుతనం నుంచి రక్షించగలదని తద్వారానే ఉన్నత స్థితికి రాగలమని నమ్మి అటువంటి దూరదృష్టి కలిగిన మేధావిగా పూలేను పిల్లి బోసు అభివర్ణించారు. అంతకు ముందు బోసుతో పాటు హాజరైన ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, షేక్ అబ్దుల్ బషీరుద్దీన్, కాకినాడ ఆర్డిఓ కెవి రమణ, బీసీ వెల్ఫేర్ ప్రోగ్రాం ఇన్చార్జ్ టీవీబి ప్రసాద్, ఏబిసిడబ్ల్యూఓ ఎన్ రాజేశ్వరి, కార్పొరేషన్ ఎడిసి సిహెచ్ నాగ నరసింహారావు, బీసీ కార్పొరేషన్ ఎఇఓ జి సత్యనారాయణ, కాకినాడ అర్బన్ తహశీల్దార్ పీవీ సీతాపతి రావు, నాయకులు చొల్లంగి వేణుగోపాల్, సుందరపల్లి గోపాలకృష్ణ, పప్పు దుర్గాప్రసాద్, రాయుడు నాగేశ్వరరావు,



రాయుడు దుర్గ, గందం రవి,రాయుడు వెంకటేశ్వరరావు, కండిపల్లి రమణ, పెంకే శ్రీనివాస బాబా, అనుసూరి సతీష్, పంపన మురళి, అల్లి రాజబాబు, బీజేపీ నాయకులు యెనిమిరెడ్డి మాలకొండయ్య, సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, గట్టి సత్యనారాయణ, కుండల సాయికుమార్, చిలుకూరి రామ్ కుమార్, దిలీప్ సదనాని, విశ్వనాధపల్లి సత్యనారాయణ రాజు, కొక్కిలిగడ్డ గంగాధర్, పైడా వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వేణుగోపాల్, గోపాలకృష్ణలు కాకినాడ నగరంలో పూలే భవన నిర్మాణం నిమిత్తం 2017లో 448 గజాలు, 2018లో 2000 గజాలు స్థలం ఇస్తున్నట్లు ప్రకటించారని అది ఆచరణలో అమలు కాలేదని ఎంపీ పిల్లి బోస్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో బోసు స్పందించి ఆయన స్వయంగా రాసి లేఖను కలెక్టర్ శుక్లాకు అందించి తగు చర్యలు చేపట్టాలని బోస్ సూచించారు.

## గవర్నర్ వద్ద పెండింగ్ బిల్లులపై స్పందించిన మంత్రి జగదీష్ రెడ్డి

**సూర్యాపేట**

రాష్ట్ర అభివృద్ధి అడ్డుకోవడానికి గవర్నర్లను బీజేపీ ఏజెంట్లలా కేంద్రం వాడుకుంటుదని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. కేంద్రంలో మోడీ కార్యక్రమాలను రాష్ట్రపతి అడ్డుకోనప్పుడు రాష్ట్రాలలో గవర్నర్లు అడ్డుకోవడం ఎందుకు. నిర్ణీత వ్యవధిలో బిల్లుల ఆమోదం కోసం సుప్రీం ని ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకోవడం గవర్నర్ పనికాదని అయన అన్నారు. జేపీ ప్రభుత్వాల కంటే మెరుగ్గా పనిచేస్తున్న ఇతర పార్టీల ప్రభుత్వాల అభివృద్ధిని కేంద్రం అడ్డుకుంటుంది. తెలంగాణా మోడల్ అభివృద్ధి దేశమంతా అడుగుతున్నారని అక్కసుతో దుర్మార్గం. కేసీఆర్ ని, తెలంగాణా అభివృద్ధిని అడ్డుకోవాలనే ఆలోచనతో కేంద్రం నాటకం. శాసనసభ ప్రసంగంలో చెప్పిన అభివృద్ధి కార్యరూపం దాల్చకుండా అడ్డుకుంటున్న గవర్నర్. ఉపన్యాసంలో ఒకటి చెప్పి రాజ్ భవన్ లో చేసేది మరొకలా ఉంది. గవర్నర్ తీరు భారత రాజ్యాంగం వ్యవస్థకు మంచిది కాదు. గవర్నర్ చర్యలు రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంలా మారుతుంది. రాష్ట్ర అభివృద్ధి అడ్డుకోడమంటే దేశ అభివృద్ధిని అడ్డకోవడమేనని అయన అన్నారు.

## టీడీపీ అందోళన

**గూడూరు**

గూడూరు పట్టణ సమీపంలోని గోగినేనిపురం వద్ద ఉన్న డివిజనల్ విద్యుత్ కార్యాలయం వద్ద కరెంటు చార్జీల పెంపుకు టిడిపి పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ , నాయకులు కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు . ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు . ఈఈ ఇస్మాయిల్ అహ్మద్ కు వినతి పత్రం అందజేశారు . మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో కరెంటు చార్జీలు పెంచలేదని వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఏడుసార్లు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . మరోవైపు ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని దీనివల్ల రైతులు నష్టపోతారని గత టిడిపి ప్రభుత్వంలో ఆక్వా రైతులకు కరెంటు చార్జీలు తగ్గించామని అయితే ఈ ప్రభుత్వంలో చార్జీలు పెంచినందువల్ల ఆక్వా రైతులు నష్టపోతున్నారని తెలిపారు . ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీనివాసులు ,వెంకటేశ్వర రాజు ,బిల్లు చెంచురామయ్య ,ఇజ్రాయిల్ ,రహీం ,మట్టం శ్రావణి ,తదితరులు పాల్గొన్నారు .

## కేంద్రంపై మండిపడ్డ మంత్రి హరీష్ రావు

**సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా పరిషత్తు మీటింగ్ లో కేంద్ర ప్రభుత్వంపై మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేసారు. మోటర్లకు మీటర్లు పెట్టలేదని తెలంగాణకి వచ్చే 30 వేల కోట్లను కేంద్రం ఆపింది. పక్కనే ఉన్న ఎపి మోటర్లకు మీటర్లు పెట్టి డబ్బులు తెచ్చుకుంది. 1350 కోట్లు వెనుకబడిన జిల్లాల నిధి కేంద్రం ఆపింది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు రావాల్సిన 24 వేల కోట్ల రూపాయలు ఇవ్వలేదు. నీతి అయోగ్ ఇవ్వాలని చెప్పినా 1300 కోట్ల రూపాయలు కేంద్రం ఇవ్వలేదు. రైతుల కోసం కల్లాలు నిర్మిస్తే కేంద్రం డబ్బులు వాపస్ కట్టించుకుంది. తెలంగాణలో వ్యవసాయానికి కరెంట్ సరిపోవడం లేదు. అదనంగా యూనిట్ కి 20 రూపాయలు ఇచ్చి విద్యుత్ కోసం నెలకు 1500 కోట్లు చెల్లించి విద్యుత్ తీసుకుంటున్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తున్న తెలంగాణ ప్రభుత్వమని అన్నారు.

## విద్యుతు ఛార్జీలు తగ్గించాలి

**కాకినాడ**

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్లను ముట్టడించి, విద్యుత్ ఇంజనీర్ కార్యాలయాల వద్ద టిడిపి నాయకులు నిరసన తెలియజేస్తూ ధర్నాలు నిర్వహించి, ప్రధాన రహదారుల వద్ద రాస్తారోకోలు చేశారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

కాకినాడ ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం సబ్ స్టేషన్ వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు వైసీపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జిలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. జగన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా ధనం లూటీ కోసమే వినియోగదారులపై అక్రమ మార్గంలో విద్యుత్ చార్జీలు భారం మోపుతున్నారని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు విమర్శించారు. అనంతరం వైసిపి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ జెఇకి వినతిపత్రం అందజేశారు.

## ఉచితంగా విద్యుత్ స్మార్ట్ మీటర్లు

**చెన్నై**

విద్యుత్ చౌర్యం, రీడింగ్‌లలో అవకతవకలు అడ్డుకొనేలా గృహాలు, దుకాణాలు, వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్లుఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా స్థానిక టి.నగర్‌లో 1.42 లక్షల స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే పనులను ప్రయోగాత్మకంగా చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వ ఆమోదం తెలిపింది. స్మార్ట్ మీటరు ఏర్పాటుకు రూ.6 వేలు వెచ్చించేందుకు కేంద్రప్రభుత్వం అంగీకరించింది. ఈ నేపథ్యంలో, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వినియోగదారుల నుంచి ఎలాంటి నగదు వసూలు చేయమని విద్యుత్ బోర్డు తెలిపింది

ప్రజా తపన
prajathapana.com
News that matters

# నెల రోజులైనా కనిపించని పురోగతి

**హైదరాబాద్:**

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసు దర్యాప్తు కేసు రోజుకో మలుపు తిరుగుతుంది. ఈ కేసులో సిట్ విచారణ ప్రారంభమై నెల దాటినా ఇంకా పూర్తిస్థాయి వివరాలు బయటపడలేదు. నెల రోజుల తర్వాత గాని డివిజనల్ ఎకౌంట్స్ ఆఫీసర్(డీఏవో) ప్రశ్నపత్రం లీకేజీ నిందితులు పట్టుబడలేదు. ప్రశ్నపత్రాలు ఎన్ని లీకయ్యాయి, ఎంతమంది లబ్ధి పొందారన్న విషయంపై ఇప్పటికీ స్పష్టత రావడం లేదు. కమిషన్ మొత్తం ఏడు పరీక్షలు నిర్వహించగా వాటిలో నాలుగింటిని రద్దు చేసింది. వీటిలో మూడు పరీక్షలకు సంబంధించిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రాబోయే రోజుల్లో దర్యాప్తులో బయటపడే అంశాల ఆధారంగా మిగతా పరీక్షల భవిష్యత్తు ఆధారపడి ఉంది. దర్యాప్తులో మొదట ఏఈ ప్రశ్నపత్రం, ఆ తర్వాత గ్రూప్-1 ప్రశ్నపత్రం లీకైనట్లు తేలింది. వీటిని ప్రవీణ్, రాజశేఖర్ ముఠా లీక్ చేసినట్లు నిర్ధారణ అయినప్పటికీ.. ఆధారాల సేకరణ సిట్‌కు సవాలుగా మారింది. డీఏవో పరీక్ష ప్రశ్నపత్రం ఎవరికి అమ్మారన్న విషయం దాదాపు నెల రోజుల తర్వాత వెలుగులోకి రావడమే ఇందుకు నిదర్శనం. అయితే మొత్తం ఎన్ని ప్రశ్నపత్రాలు లీకయ్యాయి? ఎంతమంది చేతికి చిక్కాయన్నది? మాత్రం మిస్టరీగా మారింది. గ్రూప్-1, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, సీడీపీవో, సూపర్ వైజర్ గ్రేడ్-1, డీఏవో, ఏఈఈ, ఏఈ పరీక్షలను పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించింది. దర్యాప్తు మొదలైనప్పుడు వీటిలో గ్రూప్-1, ఏఈ, ఏఈఈ, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షలను రద్దు చేసింది. సీడీపీవో, సూపర్ వైజర్ గ్రేడ్-1, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పరీక్షలు రద్దు కాలేదు. కమిషన్‌లోని కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌కు చెందిన కంప్యూటర్ వ్యవస్థలోకి చొరబడ్డ నిందితుడు రాజశేఖర్ అందుబాటులో ఉన్న ప్రశ్నపత్రాలను తస్కరించాడు. అతడికి చిక్కాయని భావిస్తున్న నాలుగు పరీక్షలను ముందుగానే రద్దు చేశారు. గ్రూప్-1, ఏఈ ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించి సిట్ ఇప్పటివరకూ 14 మందిని అరెస్టు చేసింది. డివిజనల్ ఎకౌంట్స్ ఆఫీసర్ ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించి తాజాగా ఇద్దరిని అరెస్టు చేయడంతో ఈ సంఖ్య 16కు చేరింది. సిట్ దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. మరోవైపు న్యాయస్థానం అనుమతితో ప్రవీణ్‌ను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు.. ప్రశ్నపత్రాలను ఎవరెవరికి ఇచ్చాడన్న విషయాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఎన్ని రకాలుగా ప్రశ్నించినా అతడు నోరు మెదపలేదని తెలిసింది. తొలుత ఏఈ ప్రశ్నపత్రం మాత్రమే అమ్మానని చెప్పాడు. పోలీసులు జరిపిన సాంకేతిక దర్యాప్తులో ఖమ్మానికి చెందిన సాయి లౌకిక్‌కు డీఏవో ప్రశ్నపత్రాన్ని రూ.6 లక్షలకు అమ్మినట్లు తేలింది. దీంతో లౌకిక్‌తో పాటు అతడి భార్య సుష్మితను కూడా అరెస్టు చేశారు. దర్యాప్తులో మొదట ఏఈ ప్రశ్నపత్రం, ఆ తర్వాత గ్రూప్-1 ప్రశ్నపత్రం లీకైనట్లు తేలింది. వీటిని ప్రవీణ్, రాజశేఖర్ ముఠా లీక్ చేసినట్లు నిర్ధారణ అయినప్పటికీ.. ఆధారాల సేకరణ సిట్‌కు సవాలుగా మారింది. డీఏవో పరీక్ష ప్రశ్నపత్రం ఎవరికి అమ్మారన్న విషయం దాదాపు నెల రోజుల తర్వాత వెలుగులోకి రావడమే ఇందుకు నిదర్శనం. అయితే మొత్తం ఎన్ని ప్రశ్నపత్రాలు లీకయ్యాయి? ఎంతమంది చేతికి చిక్కాయన్నది? మాత్రం మిస్టరీగా మారింది. గ్రూప్-1, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, సీడీపీవో, సూపర్ వైజర్ గ్రేడ్-1, డీఏవో, ఏఈఈ, ఏఈ పరీక్షలను పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించింది. దర్యాప్తు మొదలైనప్పుడు వీటిలో గ్రూప్-1, ఏఈ, ఏఈఈ, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షలను రద్దు చేసింది. సీడీపీవో, సూపర్ వైజర్ గ్రేడ్-1, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పరీక్షలు రద్దు కాలేదు. కమిషన్‌లోని కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌కు చెందిన కంప్యూటర్ వ్యవస్థలోకి చొరబడ్డ నిందితుడు రాజశేఖర్ అందుబాటులో ఉన్న ప్రశ్నపత్రాలను తస్కరించాడు. అతడికి చిక్కాయని భావిస్తున్న నాలుగు పరీక్షలను ముందుగానే రద్దు చేశారు. గ్రూప్-1, ఏఈ ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించి సిట్ ఇప్పటివరకూ 14 మందిని అరెస్టు చేసింది. డివిజనల్ ఎకౌంట్స్ ఆఫీసర్ ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించి తాజాగా ఇద్దరిని అరెస్టు చేయడంతో ఈ సంఖ్య 16కు చేరింది. సిట్ దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. మరోవైపు న్యాయస్థానం అనుమతితో ప్రవీణ్‌ను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు.. ప్రశ్నపత్రాలను ఎవరెవరికి ఇచ్చాడన్న విషయాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఎన్ని రకాలుగా ప్రశ్నించినా అతడు నోరు మెదపలేదని తెలిసింది. తొలుత ఏఈ ప్రశ్నపత్రం మాత్రమే అమ్మానని చెప్పాడు. పోలీసులు జరిపిన సాంకేతిక దర్యాప్తులో ఖమ్మానికి చెందిన సాయి లౌకిక్‌కు డీఏవో ప్రశ్నపత్రాన్ని రూ.6 లక్షలకు అమ్మినట్లు తేలింది. దీంతో లౌకిక్‌తో పాటు అతడి భార్య సుష్మితను కూడా అరెస్టు చేశారు. ఎస్ఐ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన తుది రాత పరీక్షలు నేటితో ముగిశాయి. ఈ పరీక్షలకు 96 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌లోని మొత్తం 81 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. శనివారం రెండు పేర్లు, ఆదివారం రెండు పేపర్ల చొప్పున తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది. శనివారం జరిగిన పరీక్షలకు 81 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపింది. 62,342 మంది అభ్యర్థులకు గాను 59,534 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఆదివారం 79 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 60,772 మంది అభ్యర్థులకు గాను 58,019 మంది పరీక్షలు రాశారు. ఈ పేపర్లకు సంబంధించిన ప్రిలిమినరీ కీని త్వరలోనే అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది.

# మహాత్మా జ్యోతిబాపులే ఆశయాలకు అనుగుణంగానే రాష్ట్రంలో కేసిఆర్ పాలన

**హైదరాబాద్**



మహాత్మా జ్యోతిబా పూలే 197వ జయంతి సందర్భంగా మంత్రుల నివాస సముదాయంలోని తన అధికారిక నివాసంలో రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఘన నివాళి అర్పించారు. ఈ దేశానికి పూలే చేసిన సేవలు, త్యాగాలను స్మరించుకున్నారు. జ్యోతిబా పూలే అందించిన స్ఫూర్తితో కేసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం పురోగమిస్తోందని తెలిపారు. కేసిఆర్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసం పాటుపడుతున్నదని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో నేడు తెలంగాణలోని దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాలు, మహిళలు.. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, విద్యాపరంగా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నమన్నారు. అణగారిన వర్గాలు, బహుజనుల సమగ్ర వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, పూలే ఆశయ స్ఫూర్తిని కొనసాగిస్తామని మంత్రి వేముల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావు,మంత్రి కార్యాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# దూదేకుల ముస్లింలకు ప్రోత్సాహం-నారా లోకేష్

**తాడిపత్రి**

పెద్దపప్పూరు శివార్లలో దూదేకుల ముస్లిం ప్రతినిధులతో టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ముఖాముఖీ సమావేశంలో నిర్వహించారు. దూదేకుల ప్రతినిధులు మాట్లాడుతూ 40 లక్షలు మంది జనాభా ఉన్నా మాకు ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం అందడం లేదు. బిసి బి నుండి బిసి ఈ లోకి చేర్చాలి. అనేక వృత్తులు చేస్తున్నాం కానీ మాకు వైసిపి ప్రభుత్వం నుండి రుణాలు అందడం లేదు. మాకు కనీసం ఖబర్ స్తాన్ లు లేక ఇబ్బంది పడుతున్నాం. టిసిలు ఇచ్చే సమయంలో దూదేకుల ముస్లీం విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నాం. ముస్లీం దూదేకుల అని సర్టిఫికేట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. దూదేకుల ముస్లీం లు ఆర్థికంగానూ, రాజకీయంగానూ వెనుకబడి ఉన్నారు. దూదేకుల ముస్లీంలకు వ్యాపారాలు చేసుకోవడానికి సబ్సిడీ రుణాలు ఇవ్వడం లేదు. దూదేకుల ముస్లీం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ పథకం అమలు కావడం లేదు, విదేశీ విద్య పథకం రద్దు చేశారని అన్నారు.

లోకేష్ మాట్లాడుతూ జగన్ పనైపోయింది... ప్రజలు భయం నుండి బయటకి రావాలి. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తాం. వక్ఫ్ భూములు కాపాడటానికి వక్ఫ్ బోర్డు కి జ్యుడిషియల్ పవర్ కల్పిస్తాం. ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తాం అని జగన్ మోసం చేశారు. ఎవరి హయాంలో మైనార్టీలకు న్యాయం జరిగిందో చర్చకు నేను సిద్ధం డిప్యూటీ సీఎం అంజాద్ బాషా రు సిద్ధమా? దేశంలోనే మొదటి మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది టిడిపి. హజ్ హౌస్ లు నిర్మించింది టిడిపి. హజ్ యాత్రకు సహాయం చేసింది టిడిపి. ఉర్దూ యునివర్సిటీ ఏర్పాటు చేసింది. ఉర్దూ టీచర్ పోస్టులు భర్తీ చేసింది టిడిపి. రంజాన్ తోఫా ఇచ్చింది టిడిపి, దుల్హన్ పథకం, దుకాన్ మకాన్ కార్యక్రమం అమలు చేసింది టిడిపి. మసీదులు, ఈద్గా ల అభివృద్ధి కి నిధులు కేటాయించింది టిడిపి. ఖబర్ స్తాన్ లు అభివృద్ధి చేసింది టిడిపి. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత మైనార్టీలను మోసం చేసింది. ఉన్న అన్ని సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేశారు. నూర్ బాషా ఫెడరేషన్ ఏర్పాటు చేసి 40 కోట్ల రూపాయల నిధులు కేటాయించింది టిడిపని అన్నారు.

వైసిపి నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదు. ఒక్క రుణం ఇవ్వలేదు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే దూదేకుల ముస్లీంలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతాం. నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ క్లస్టర్స్ లో దూదేకుల ముస్లీంలకి ప్రత్యేకంగా భూములు కేటాయిస్తాం. దూదేకుల ముస్లీంలకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చింది టిడిపి. 1999 నాగుల్ మీరా కి ఎమ్మెల్యే సీటు ఇచ్చాం. చమన్ గారికి జెడ్పీ ఛైర్ పర్సన్ పదవి ఇచ్చింది టిడిపి. నాగుల్ మీరా గారికి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మెన్ పదవి ఇచ్చింది టిడిపి. 2024 లో దూదేకుల ముస్లీం లకి. చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తాం. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదరణ పథకం ద్వారా దూదేకుల ముస్లీంలకు పనిముట్లు అందజేస్తాం. ఆఖరికి స్మశానం భూముల్ని కూడా వైసిపి నాయకులు కబ్జా చేస్తున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే దూదేకుల ముస్లీం లు ఎక్కువ ఉండే గ్రామాల్లో ప్రత్యేక ఖబర్ స్తాన్ లు నిర్మిస్తాం. దూదేకుల ముస్లీం విద్యార్థుల సర్టిఫికెట్ల సమస్యను టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తాం. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే శాశ్వత కుల ధృవీకరణ పత్రాలు అందజేస్తాం. బిజెపి తో పొత్తులో ఉన్నా టిడిపి ముస్లీంలను ఏనాడూ చిన్న చూపు చూడలేదు. పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసాం. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లీం లను వేధించి చంపేస్తున్నారు. కర్నూలు లో అబ్దుల్ సలాం కుటుంబాన్ని వేధించి చంపేశారు. మిస్బా అనే 10 తరగతి అమ్మాయి ని వైసిపి నేత వేధించి చెంపేసాడు. తాడిపత్రి ని అద్భుతంగా అభివృద్ధి చేసింది జేసీ కుటుంబం. గతంలో తాడిపత్రి వచ్చి మున్సిపల్ కార్యాలయం చూసినప్పుడు నేను ఆశ్చర్యానికి గురయ్యాను. కార్పొరేషన్ కి కూడా అంత అద్భుత భవనం ఉండదు. తాడిపత్రి కి అనేక పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగాలు కల్పించింది జేసీ ప్రభాకర్ రెడ్డి. కానీ ఇంకా ఏదో వస్తుంది అని ఆశించి పాలిచ్చే ఆవుని వద్దనుకొని తన్నే దున్నపోతు ని తెచ్చుకున్నారు. అప్పుడు అభివృద్ధి లో నంబర్ 1 గా ఉన్న తాడిపత్రి ఇప్పుడు అవినీతి లో నంబర్ 1 గా ఉంది. అప్పుడు తాడిపత్రి ఎలా ఉంది .ఇప్పుడు తాడిపత్రి లో ఏం జరుగుతుంది ఒక్క సారి ప్రజలు ఆలోచించాలి. నాపై 20కి పైగా కేసులు ఉన్నాయి. ప్రభాకర్ రెడ్డి గారిపై 70 కేసులు ఉన్నాయి. అయినా ప్రజల తరపున పోరాడుతున్నామని అన్నారు.

# జూపల్లి వర్సెస్ నిరంజన్

**మహబూబ్ నగర్:**





పార్టీ నుంచి సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. పంజరం నుంచి బయటపడినంత సంతోషంగా ఉందన్నారు. తనకు పార్టీలో సభ్యత్వం ఉందో లేదో కూడా తెలియదని, రాజశేఖర్ రెడ్డి ఫోటో పెట్టుకోడాన్ని ప్రశ్నించే నీచ స్థాయికి బిఆర్ఎస్ పార్టీ దిగజారిపోయిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి జూపల్లిని సస్పెండ్ చేసిన వ్యవహారం మంత్రి నిరంజన్ రెడ్డి, జూపల్లి మధ్య మాటల యుద్దానికి దారి తీసింది. జగన్మోహన్ రెడ్డి కోసం తాను కూడా పదవికి రాజీనామ చేస్తానని జూపల్లి చెప్పారని, తెలంగాణ కోసం ఏనాడు రాజీనామా చేస్తాననలేదని మంత్రి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. జూపల్లి ప్రజల కోసం అంకితమై పనిచేసినట్లు మాట్లాడుతున్నారని, తెలంగాణ ప్రజలకు అన్యాయం జరిగినట్లు మాట్లాడుతున్నారని, తెలంగాణ కోసం పనిచేసిన దానికంటే పార్టీ ఎక్కువగా గౌరవించిన సంగతి మర్చిపోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తెలంగాణకు బద్ద వ్యతిరేకి, శత్రువని తెలిసిన తర్వాత కూడా జూపల్లి తన ఇంట్లో రాజశేఖర్ రెడ్డి ఫోటో పెట్టుకున్నారని ఆరోపించారుమంత్రిని చేసిన కేసీఆర్ ఫోటో పెట్టుకోని జూపల్లి రాజశేఖర్ రెడ్డి ఫోటో మాత్రం పెట్టుకున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులు, తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెడితే వారి మీద కేసులు పెట్టించి జైలుకు పంపారని, తెలంగాణలో దగ్గరుండి వైఎస్ విగ్రహాలు పెట్టించారని గుర్తు చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో ఒక్క తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా జూపల్లి పెట్టించలేదని విమర్శించారు. తెలంగాణ మీద అభిమానంతో ఓ ఉద్యోగి విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తే అతడిని జైలుకు పంపించాడని గుర్తు చేశారు. తన నియోజక వర్గంలో ఒక్క తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా జూపల్లి పెట్టించలేదన్నారు. తెలంగాణకు ఏదో అన్యాయం జరిగిపోతున్నట్లు మాట్లాడుతున్నారని, పార్టీ కడుపులో పెట్టుకుని చూసుకున్నా నమ్మక ద్రోహం చేశారని ఆరోపించారు. తెలంగాణలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగున్నర లక్షల కోట్ల రుపాయలు వ్యవసాయ రంగంపై ఖర్చు చేశారన్నారు. తెలంగాణ మాదిరి తలసారి ఆదాయం దేశంలో ఎక్కడైనా ఉందా అని నిలదీశారు. తెలంగాణ మాదిరి అభివృద్ధి సాధించిన రాష్ట్రం ఏదైనా ఉందా అని మంత్రి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. లక్షల ఎకరాలకు సాగు నీరు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని మంత్రి నిరంజన్ రెడ్డి చెప్పారు. నిరంజన్ రెడ్డి వ్యాఖ్యలపై జూపల్లి కృష్ణారావు ఘాటుగా స్పందించారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాతో మాట్లాడేందుకు ప్రయత్నించిన జూపల్లిని అసెంబ్లీ అసెంబ్లీ భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. స్పీకర్ ఆదేశాల మేరకు క్వార్టర్‌లో మీడియాను అనుమతించమని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినందుకు తనకు సంతోషంగా ఉందని జూపల్లి చెప్పారు. పంజరం నుంచి బయట పడ్డట్టు ఉందన్నారు. సమైక్య రాష్ట్రంలో కూడా ఇంత దుర్మార్గంగా వ్యవహరించలేదన్నారు. తనకు పార్టీలో సభ్యత్వం ఉందో లేదో కూడా తెలియదని, రెండేళ్లుగా సభ్యత్వ నమోదుకు పుస్తకాలు ఇవ్వాలని కోరుతున్నా ఇవ్వలేదన్నారు. మందిమాగదులతో ప్రెస్మీట్లు పెట్టించడం కాదని, కేసీఆర్ తన ప్రశ్నల్లో అబద్దాలు ఉంటే సమాధానం చెప్పాలని, తాను మాట్లాడిన వాటిని రుజువు చేయడానికి సిద్దంగా ఉన్నానని చెప్పారు. తన ప్రశ్నలకు భయపడి తనను సస్పెండ్ చేశారని ఆరోపించారు. తెలంగాణలో వారి బండారం బయటపడుతుందనే కారణంతోనే సస్పెండ్ చేశారని ఆరోపించారు. సస్పెండ్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రాష్ట్రానికి ధర్మకర్తగా ఉండాలని, ప్రభుత్వ ఖజానాకు ధర్మకర్తగా ఉండాలని, ప్రతి అంశంపై పారదర్శకంగా పాలన చేయడం ముఖ్యమంత్రి బాధ్యత అనే విషయాన్ని మరిచిపోయి, రాష్ట్రం నాది, నా ఇష్టం వచ్చినట్లు దానధర్మాలు చేస్తాను అన్నట్లు పరిపాలన సాగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సాధనలో తెలంగాణ సమాజం మొత్తం భాగస్వాములు అయ్యారన్నారు. ఎంతోమంది బలిదానాలు చేస్తేనే రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణలో మాట్లాడే స్వేచ్ఛ ఉండాలి, మూడు పూటల తిండి తినాలి అనే కోరికతో ప్రాణ త్యాగాలు చేశారన్నారు. తనలా ఒక్కరు కూడా పదవిని విడిచి పోరాటం చేయలేదన్నారు. 2011 మార్చిలో సకల జనుల సమ్మెను రద్దు చేస్తున్నట్లు జేఏసీ ప్రకటించిందని, అదే రోజు ముఖ్యమంత్రి తెలంగాణ ఉద్యమాన్ని అణిచి వేశానని ఎగతాళి చేశారన్నారని జూపల్లి గుర్తు చేశారు. తెలంగాణ ప్రజా ప్రతినిధులు అరగంట కూడా పదవుల్ని వదిలి ఉండలేరని అప్పట్లో కావూరి విమర్శించారని, ఆ వార్తలు చూసి చలించి, ప్రజా ప్రతినిధులతో మాట్లాడి, పదవులు ఎందుకని భావించి అప్పటికప్పుడు పదవికి రాజీనామా ఇచ్చానని గుర్తు చేసుకున్నారు. సిఎంకు రాజీనామా లేఖను ఇస్తే నీ రాజీనామాతో తెలంగాణ వస్తుందా అని తనను ప్రశ్నించారని, మీ రాజీనామాలతో తెలంగాణ ఆగిందా లేదా అని ప్రశ్నిస్తే ఆయన సమాధానం చెప్పలేదన్నారు. తనను ఏం కావాలో అడగమని సిఎం ఆఫర్ ఇచ్చారని, వెయ్యి కోట్లు కూడా తనను కొనలేరని చెప్పానన్నారు. ఆ తర్వాత జిల్లాలో పాదయాత్ర చేశానని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు గుర్తు చేశారు. మూడున్నరేళ్ల పదవీ కాలాన్ని వదిలి పార్టీలో చేరానని చెప్పారు. రాజశేఖర్ రెడ్డి ఫోటో తన ఇంట్లో ఆ రోజు ఉంది, ఈ రోజు తనింట్లో ఉందన్నారు. నా ఇంట్లో ఎవరి ఫోటో ఉండాలో నా ఇష్టమన్నారు. ప్రతి వ్యక్తిలో మంచి చెడులు ఉంటాయన్నారు. కేసీఆర్ ఫోటో ఇప్పటికీ తన ఇంట్లో ఉందన్నారు. బిఆర్ఎస్ నాయకులు తమ స్థాయి దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తాను మాట్లాడిన దాంట్లో తప్పేమి ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం సమావేశంలో తానేమి తప్పు మాట్లాడలేదని స్పష్టం చేశారు. వనపర్తిలో రూ.5లక్షల పనికి రూ.70లక్షలు వసూలు చేసిన ప్రజా ప్రతినిధి మళ్లీ రూ.26కోట్లు కావాలని కోర్టుకు వెళ్లారని, కోర్టు బయట డబ్బు చెల్లించి ఒప్పందం చేసుకున్నారని, అదెంత వరకు న్యాయమని ప్రశ్నించానన్నారు. అధికారంలోకి వచ్చాక సాగునీటి రంగంలో లక్షా 80వేల కోట్లలో, లక్షా 20వేల కోట్లు చెల్లింపులు చేశారని, కాంట్రాక్టుల కేటాయింపుల్లో ఒక్క శాతం కూడా తగ్గించకుండా పనులు కేటాయించారని, ఇలా ఎందుకు జరిగిందని ప్రశ్నించారు. ఈ డబ్బులు ఎవరికి కట్టబెట్టారో చెప్పాలని డిమాండ్ చేయడం తప్పా అని ప్రశ్నించారు.

# ఆత్మగౌరవ ఉద్యమాలకు ఆది పురుషుడు మహాత్మజ్యోతిబా

**అల్వాల్**

భారతదేశంలో ఆత్మగౌర ఉద్యమాలకు పునాదులు వేసిన ఆది పురుషుడు మహాత్మ జ్యోతిరావు పూలే. మంగళవారం జ్యోతిబాపూలే 189 వ జయంతి సందర్భంగా ఓల్డ్ ఆల్వాల్ అంబేద్కర్ నగర్ లోని జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం న హక్కుల పోరాట సమితి కన్వీనర్ యాదగిరి మాట్లాడారు . దేశంలో వస్తున్న సనాతన ఆచారాలు వ్యవహారాలతో కట్టు బానిసలుగా ఉన్న వారిని సామాజిక చైతన్యంతో ఆత్మగౌరవం ఉద్యమాల వైపు నడిపించిన నాయకుడు జ్యోతిబాపూలే అని తన సతీమణి అయిన సావిత్రిబాయి పూలే కు చదువులు నేర్పించి భారతదేశంలో మొదటిసారిగా మహిళలకు విద్యాబోధన జరిపించిన తొలి గురువుగా నిలిచిన వ్యక్తి జ్యోతిబాపూలే దంపతులను చెప్పారు. వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని రాచరికపు వ్యవస్థ నుండి విముక్తి కోరి ప్రతి ఒక్కరికి సమాన హక్కులు ఉండాలని పాటుపడిన మహనీయుడు మహాత్మ జ్యోతిబాపూలేని అణగారిన హక్కుల పోరాట సమితి కన్వీనర్ యాదగిరి తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వంచినాయన స్థానిక సమస్యలను కూడా తీసుకువచ్చారు. ప్రధానంగా అంబేద్కర్ నగర్ వజ్ర ఇంట్లో మధ్యలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కాలనీవాసులు రకరకాల అడ్డంకులు సృష్టిస్తున్నారని అడ్డంకులను తొలగించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించిన పది లక్షల రూపాయలతో పనులు చేపట్టాలని కోరుతూ మేమో రాండం సమర్పించారు. కార్యక్రమంలో మచ్చ బొల్లారం అల్వాల్ జేఏసీ నాయకులు కార్యకర్తల బృందం, ఓల్డ్ ఆల్వాల్ అంబేద్కర , హాజరు కాగా పైన తన గాత్రంతో మంచి పాటలు పాడి జ్యోతిబాపూలే , సావిత్రిబాయి పూలే, విశ్వరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర మరియు వారి సేవలను కొనియాడుతూ పాటలు పాడారు...

# ఎల్‌జీఎం' ఫస్ట్‌లుక్ విడుదల



లెజెండరీ ఇండియన్ క్రికెటర్ ఎంఎస్ ధోని, సాక్షి ధోని నిర్మాణ సంస్థ ధోని ఎంటర్‌టైన్‌మెంట్ తొలి ప్రాజెక్ట్ 'ఎల్‌జీఎం' ప్రారంభమైనప్పటి నుంచి సినీ అభిమానులను ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

రమేష్ తమిళ్ మణి దర్శకత్వం వహిస్తున్న 'ఎల్‌జీఎం' ఫస్ట్‌లుక్‌ని ధోనీ తన అఫీషియల్ ఫేస్‌బుక్ పేజీలో విడుదల చేశారు. ఇది ఈ ప్రాజెక్ట్‌పై ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. దీనిపై చిత్ర నిర్మాత వికాస్ హసిజా హర్షం వ్యక్తం చేస్తూ 'ఎల్‌జిఎం' చిత్రం అద్భుతంగా రూపొందుతోంది. షూటింగ్ చివరి షెడ్యూల్‌లో ఉన్నాము. త్వరలో పోస్ట్-ప్రొడక్షన్‌కి వెళ్తాము. ఇది గ్రేట్ జర్నీ " అని తెలిపారు.

క్రియేటివ్ ప్రొడ్యూసర్ ప్రియాంషు చోప్రా మాట్లాడుతూ "సినిమాలో చాలా సర్ ప్రైజింగ్ ఎలిమెంట్స్ వుంటాయి. మొత్తం నటీనటులు, సిబ్బంది చాలా ప్రతిభావంతులు. చాలా ఫ్రెష్ కాన్సెప్ట్ తో సినిమా రాబోతుంది" అన్నారు.

'ఎల్‌జీఎం' ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఇందులో హరీష్ కళ్యాణ్, నదియా, ఇవానా టైటిల్ రోల్స్ పోషిస్తుండగా.. యోగి బాబు, మిర్చి విజయ్, మరికొంత మంది ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపిస్తారు. ఈ చిత్రానికి దర్శకుడు రమేష్ తమిళ్ మణి సంగీతం కూడా అందిస్తున్నారు.

# 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల



ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ జీఏ2 పిక్చర్స్ బ్యానర్ పై తెరకెక్కుతోన్న సినిమా 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'. సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాసు మరియు దర్శకుడు వెంకటేష్ మహా ఈ సినిమాను ప్రెజెంట్ చేస్తున్నారు. భలే భలే మగాడివోయ్, గీత గోవిందం, టాక్సీవాలా, ప్రతిరోజూ పండగే, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ , 18 పేజెస్ లాంటి అద్భుతమైన చిత్రాల తర్వాత జిఏ 2 పిక్చర్స్ బ్యానర్లో వస్తున్న సినిమా "అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు".

షార్ట్ ఫిల్మ్స్ తో కెరియర్ మొదలు 'కలర్ ఫోటో' సినిమాతో సాలిడ్ హిట్ అందుకున్నాడు సుహాస్. కేవలం యూత్ కి నచ్చే కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలు మాత్రమే కాకుండా, రీసెంట్ గా 'రైటర్ పద్మభూషణ్' వంటి సినిమా చేసి ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా దగ్గరయ్యాడు సుహాస్. ప్రస్తుతం సుహాస్ హీరోగా చేస్తున్న 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' మూవీ ఇప్పుడు షూటింగ్ పనులను ముగించుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతుంది. జీఏ2 పిక్చర్స్, స్వేచ్ఛ క్రియేషన్స్, వెంకటేశ్ మహా నిర్మాణంలో దుశ్యంత్ కటికనేని ని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ధీరజ్ మొగిలినేని ఈ సినిమాను నిర్మించారు.

మ్యారేజ్ బ్యాండ్ లో పనిచేసే మల్లి అనే కుర్రాడిగా సుహాస్ ఈ సినిమాలో నటిస్తున్నాడు. తాజాగా చిత్ర యూనిట్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. రిలీజ్ చేసిన పోస్టర్ లో మల్లికార్జున సెలూన్ షాప్ ను చూపిస్తూ, సెలూన్ షాప్ ముందు 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' మెంబర్స్ ను రివీల్ చేసారు. సుహాస్ తో పాటు గోపరాజు రమణ, పుష్ప ఫేమ్ జగదీశ్ డప్పులు, సన్నాయి తో పాటు పలురకమైన మంగళవాయిద్యాలతో ఈ పోస్టర్ లో కనిపిస్తున్నారు. సినిమాకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ ను త్వరలో అధికారికంగా ప్రకటించనుంది చిత్ర బృందం.

# విరూపాక్ష' ట్రైలర్ చూస్తుంటే అదిరిపోయే రేంజ్‌లో ఓపెనింగ్స్ వస్తాయని 100% అనిపిస్తుంది: అల్లు అరవింద్



సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తోన్న పాన్ ఇండియా మిస్టిక్ థ్రిల్లర్ విరూపాక్ష. సంయుక్తమీనన్ కథానాయిక. కార్తీక్ దండు దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థలు శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర , సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బాపినీడు బి.సమర్పణలో ప్రముఖ నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. స్టార్ డై?రెక్టర్ సుకుమార్ ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే అందించారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఏప్రిల్ 21న ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రిలీజ్ అవుతుంది. మంగళవారం (ఏప్రిల్ 11) రోజున ఈ సినిమా ట్రైలర్ స్టార్ ప్రొడ్యూసర్స్ అల్లు అరవింద్, దిల్ రాజు చేతుల మీదుగా విడుదలైంది. ఈ సందర్భంగా...

హిట్ చిత్రాల నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ "ప్రతి మనిసికి ఓ లైఫ్ జర్నీ ఉంటుంది. అందులో పడటం, లేవటం అనేది సాధారణంగానే జరుగుతుంటాయి. అలా సాయిధరమ్ తేజ్ లైఫ్ సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతున్న సమయంలో దేవుడు యాక్సిడెంట్ రూపంలో చిన్న బ్రేక్ వేశాడు. అయితే తను దాంట్లో నుంచి రికవర్ అయ్యి చేస్తున్న మొదటి సినిమా 'విరూపాక్ష'. ట్రైలర్ చూశాక వాట్ ఎ ట్రైలర్ అనిపించింది. కొత్త డైరెక్టర్ కార్తీక్, సుకుమార్ డైరెక్షన్‌లో బాపినీడు, ప్రసాద్‌గారి ప్రొడక్షన్‌లో ఓ వేల్యూస్‌తో పాటు ట్రైలర్ చూస్తుంటే గూజ్ బమ్స్ వచ్చాయి. రేపు సినిమా ఎలా ఉండబోతుందో చూపించారు. ఆల్ ది బెస్ట్ టీమ్. తేజుకి ఇది రీ ఎంట్రీ. తేజు నిన్న ఫోన్ చేసి 'సార్! నా ఫస్ట్ సినిమా పిల్లా నువ్వు లేని జీవితం మీరు అరవింద్‌గారే చేశారు. ఇప్పుడు ఇది నా రీ ఎంట్రీలాంటిది. మీరు రావాలి' అని అన్నాడు. తేజు ఫస్ట్ అనే కాదు.. ఎప్పుడు ఏ సాయం అడిగినా నేను, అరవింద్‌గారు చేయటానికి రెడీగా ఉంటాం. ట్రైలర్ చాలా బావుంది. ఈ నెల 21న సినిమా రిలీజ్ అవుతుంది. సినిమా కంటెంట్ కనిపిస్తుంది. పెద్ద సక్సెస్ అవుతుంది. నైజాం డిస్ట్రిబ్యూటర్ కాబట్టి ఈ సక్సెస్‌లో నేను కూడా ఓ పార్ట్ అవుతాను" అన్నారు.

సినిమాటోగ్రాఫర్ శ్యామ్ దత్ మాట్లాడుతూ "దర్శకుడు కార్తీక్ కథ నెరేట్ చేయగానే సూపర్ డూపర్ హిట్ అవుతుందని చెప్పేశాను. తప్పకుండా సినిమా బ్లాక్ బస్టర్ అవుతుందని చెప్పటమే కాదు.. కచ్చితంగా బ్లాక్ బస్టర్ మూవీ అవుతుందని చెప్పాను. రేపు అదే నిజమవుతుంది. నాకు అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు, నా ఎంటైర్ టీమ్‌కు థాంక్స్. చాలా మంచి టీమ్ కుదిరింది. సాయిధరమ్‌గారితో ఎప్పుడో పని చేయాల్సింది. కానీ కుదరలేదు. విరూపాక్షకు పనిచేసే అవకాశం రావటం చాలా హ్యాపీగా ఉంది" అన్నారు.

చిత్ర నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ "ఎన్టీఆర్‌గారి వాయిస్ ఓవర్‌తో ఈ సినిమా ప్రమోషన్స్ స్టార్ట్ అయ్యాయి. తర్వాత జనసేన అధినేత, పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్‌గారు టీజర్ లాంచ్ చేశారు. ఇప్పుడు రాజుగారు, అరవింద్‌గారు ట్రైలర్‌ను లాంచ్ చేశారు. అన్ని పాజిటివ్‌గానే కుదిరాయి. బాపినీడు అధ్వర్యంలో చేసిన సినిమా అందరికీ నచ్చుతుంది" అన్నారు.

సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ "ఎంతో ప్రేమించి, కష్టపడి చేసిన సినిమా. ఓ మంచి సినిమాను మీ ముందుకు తీసుకొస్తున్నాం. ఈ నెల 21 థియేటర్స్‌లో అందరం కలుద్దాం. బ్లాక్ బస్టర్ న్యూస్‌తో మాట్లాడుకుందాం. అందరూ సపోర్ట్ చేయండి. అమ్మా ఈ సినిమా నీకోసం. ఐ లవ్ యు అమ్మ. నేను అడిగిన తర్వాత సపోర్ట్ చేయటానికి వచ్చిన నా తొలి సినిమా నిర్మాతలు దిల్ రాజు, అరవింద్‌గారికి థాంక్స్" అన్నారు.

ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ మాట్లాడుతూ "తేజు ఫోన్ చేయగానే గీతా ఆర్ట్స్‌లో సినిమా చేస్తానిన చెబుతాడని అనుకుంటే ట్రైలర్‌కి రమ్మన్నాడు. తను పుట్టినప్పటి నుంచి నాకు తెలుసు. తేజుకి యాక్సిడెంట్ అయ్యినప్పుడు తనకు వెంటనే ట్రీట్‌మెంట్ ఇచ్చిన డాక్టర్స్ ..తేజుకి ఎక్కడా మేజర్‌గా గాయాలు కాలేదు. తనకేం కాదు.. బతుకుతాడు అని 15 నిమిషాల్లో చెప్పారు. తను అక్కడి నుంచి లేచి ఇప్పుడు విరూపాక్ష సినిమాలో చింపేశాడని అందరూ అంటుంటే వినటానికి చాలా సంతోషంగా ఉంది. ఈ మధ్య సినిమాలకు ట్రైలర్ బట్టి ఓపెనింగ్స్ వస్తున్నాయి. విరూపాక్ష ట్రైలర్ చూస్తుంటే పిచ్చ రేంజ్‌లో ఓపెనింగ్స్ వస్తాయని 100% అనిపిస్తుంది. బాపినీడు, ప్రసాద్‌గారితో చాలా కాలం జర్నీ ఉంది. బాపినీడు ఈ సినిమాను మన అందరికీ నచ్చేలా తీసుంటాడని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. అన్ని డిపార్ట్‌మెంట్స్ పడ్డ కష్టం తెలుస్తుంది. కాంతార చేసిన మ్యూజిక్ డైరెక్టర్ ఈ సినిమాకు మ్యూజిక్ అందించటం హ్యాపీ. అన్ని కలిసొచ్చి ఈ సినిమా ఎక్కడో నిలబడుతుంది" అన్నారు.

నటీనటులు:సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్, సునీల్, సాయిచంద్, అభినవ్ గోమటం తదితరులు

# రుద్రుడు" ఫ్యామిలీ, మాస్, యాక్షన్ ఎంటర్ టైనర్.. అందరినీ అలరిస్తుంది: రాఘవ లారెన్స్




యాక్టర్ -కొరియోగ్రాఫర్-ఫిల్మ్ మేకర్ రాఘవ లారెన్స్ హీరోగా కతిరేసన్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్ టైనర్ 'రుద్రుడు తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. లారెన్స్ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, శరత్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఫైవ్ స్టార్ క్రియేషన్స్ ఎల్ ఎల్ పి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కతిరేశన్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ ప్రొడ్యూసర్ ఠాగూర్ మధు ఈ సినిమాని తెలుగు రాష్ట్రాలలో విడుదల చేస్తున్నారు. ఇటీవలే విడుదల చేసిన థియేట్రికల్ ట్రైలర్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. రుద్రుడు ఈ నెల 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ విడుదల కానున్న నేపథ్యంలో ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ గ్రాండ్ గా నిర్వహించారు. ఈ వేడుకలో లారెన్స్ మాస్టర్ వేదికపై డ్యాన్స్ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రీరిలీజ్ ఈవెంట్ లో రాఘవ లారెన్స్ మాట్లాడుతూ.. రుద్రుడు కథని దర్శకుడు కతిరేసన్ చాలా అద్భుతంగా చెప్పారు. అందులో మదర్ సెంటిమెంట్ నా మనసుని చాలా ఆకట్టుకుంది. నా ప్రతి సినిమాలో ఫ్యామిలీ ఎలిమెంట్స్ వుండేలా చూసుకుంటాను. అదే సమయం లో మాస్, యాక్షన్ మిస్ కాకుండా చూసుకుంటాను. రుద్రుడులో ఫ్యామిలీ , మాస్, యాక్షన్, డ్యాన్స్ అన్నీ వుంటాయి. ఏప్రిల్ 14న మీ అందరూ థియేటర్ కి వెళ్లి చూడాలి. ఇక్కడికి మమ్మల్ని బ్లెస్ చేయడానికి వచ్చిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. శివ మాస్టర్ చాలా మంచి యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు. మా టెక్నికల్ టీం అందరికీ థాంక్స్. మధు గారు నాకు లక్కీ నిర్మాత. ఆయనతో చేసిన అన్ని సినిమాలు హిట్ అయ్యాయి. మధు గారు ఈ సినిమా తీసుకోవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ప్రియా భవానీ శంకర్ చాలా చక్కగా చేసింది. ఒక హీరోగా నేను బావుండాలి అనే కంటే మనిషిగా నేను బావుండాలని, నా సినిమాలన్నీ విజయాలు సాధించాలని మీరు కోరుకోవడం చాలా ఆనందంగా వుంది. 'స్క్రీన్ మీద కాదు రియల్ లైఫ్ లో హీరోగా వుండాలి" అని మా అమ్మ చెబుతూ వుంటుంది. నా వల్ల ఎంత సాయం చేయగలుగుతానో అంత చేస్తాను. ఈ సేవాకార్యక్రమాలు నన్ను పని మనిషిగా పెట్టుకొని దేవుడు చేయిస్తున్నాడని భావిస్తాను. సేవ చేయడానికి నన్ను ఎంపిక చేసుకున్న రాఘవేంద్ర స్వామికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మూడేళ్ళ తర్వాత రుద్రుడుతో వస్తున్నాను. నాపై ఎంతో ప్రేమ చూపిస్తున్న ప్రేక్షకులు, అభిమానులకు కృతజ్ఞతలు. మీలో ఎవరికైనా చదువు, వైద్యం విషయంలో సాయం కావాలనుకుంటే లారెన్స్ చారిటుబుల్ ట్రస్ట్ కి సంప్రదించండి. మీ సేవకుడిగా నేను వున్నాను. నా దగ్గర వున్న డబ్బులన్నీ మీరు ఇచ్చినవే. మీకు సేవ చేయడానికి రెడీగా వున్నాను. మీ అందరినీ కలిసినందుకు చాలా ఆనందంగా వుంది" అన్నారు. ప్రియా భవానీ శంకర్ మాట్లాడుతూ.. రుద్రుడు సినిమాలో భాగం కావడం ఆనందంగా వుంది. లారెన్స్ గారికి కృతజ్ఞతలు. రుద్రుడు ఏప్రిల్ 14న విడుదలౌతుంది. మీ అందరూ కుటుంబంతో సహా చూడాలి" అని కోరారు.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950